ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

విశాఖపట్నం

జిల్లా వార్తలు

శనివారం 10 ఫిబ్రవరి 2024





స్టీల్‌ప్లాంటును జాతికి అంకితం చేసింది పీవీనే



విశాఖ స్టీల్‌ప్లాంటును 1992 ఆగస్టు ఒకటో తేదీన ప్రధానమంత్రి హోదాలో పీవీ నరసింహారావే జాతికి అంకితం చేశారు. పీవీకి కేంద్ర ప్రభుత్వం శుక్రవారం 'భారతరత్న' ప్రకటించిన నేపథ్యంలో నాటి జ్ఞాపకాలను ఉక్కు ఉద్యోగులు, కార్మికులు గుర్తు చేసుకుంటున్నారు. పీవీకి అత్యున్నత పురస్కారం ప్రకటించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - ఉక్కుటౌన్‌షిప్

స్టీల్‌ప్లాంట్‌లో పీవీ

అప్పన్న జల విహారం

▸▸ వైభవంగా స్వామివారి తెప్పోత్సవం



సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఏటా పుష్యమాస బహుళపక్ష అమావాస్య నాడు స్వామివారు కొండదిగువన పుష్కరిణిలో ఉభయ దేవేరులతో నౌకా విహారం చేయడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని హంసాకృతిలో తీర్చిదిద్దిన నౌకలో ముమ్మారు మండపం చుట్టూ తిప్పారు. - వివరాలు III పేజీలో

నేడు నగరానికి లోకేశ్



విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శనివారం సాయంత్రం నగరానికి రానున్నారు. ఉత్తరాంధ్రలో పది రోజులపాటు నిర్వహించనున్న 'శంఖారావం' కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ఇచ్ఛాపురం నుంచి ప్రారంభించనున్నారు. శనివారం సాయంత్రం విమానంలో విశాఖ రానున్న లోకేశ్...ఇక్కడ నుంచి రోడ్డు మార్గంలో ఇచ్ఛాపురం వెళ్లి రాత్రికి అక్కడే బస చేస్తారు.

ఎడాపెడా మట్టి తవ్వకాలు

జగనన్న కాలనీల పేరుతో ఇష్టారాజ్యం

తెర వెనుక వైసీపీ నేతలు

- కాపులుప్పాడలో అనధికారిక లేఅవుట్..
- రూ.5 లక్షలు చొప్పున ఇంటి స్థలం అమ్మకం
- తెలిసినా పట్టించుకోని అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం శివార్లలో జగనన్న కాలనీల పేరుతో కొండలను ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. వాస్తవానికి జగనన్న కాలనీల్లో మట్టి వేసి, చదును చేసే పనులు పూర్తయి చాలా కాలమైంది. ప్రస్తుతం అంతా నిర్మాణాలు చేసుకుంటున్నారు. కానీ అధికార పార్టీ వైసీపీ నేతలు మట్టి వ్యాపారం ద్వారా రూ.కోట్లు ఆర్జించడానికి 'జగనన్న కాలనీ' పేరును వాడుకుంటున్నారు. గతంలో ఎక్కడైతే మట్టిని తవ్వారో ఇప్పుడు ఆ పక్కనే తవ్వకాలు చేసి, మట్టిని తరలించుకుపోతున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా చూడనట్టుగా ఉంటున్నారు.



కాపులుప్పాడలో యంత్రాలతో మట్టిని తవ్వుతున్న దృశ్యం



సర్వే నంబరు 68లో అనధికారి లేఅవుట్, నిర్మాణాలు

భీమిలి నియోజకవర్గంలోని భీమిలి, ఆనందపురం, విశాఖపట్నం రూరల్‌లో కొంత ప్రాంతంలో ఈ వ్యవహారాలు అధికంగా జరుగుతున్నాయి. భీమిలి మండలం కె.నగరంపాలెం పంచాయతీ పరదేశిపాలెం సమీపాన కాపులుప్పాడలో జగనన్న కాలనీ ఇచ్చారు. అక్కడ 343 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఆ ఇళ్ల కోసం గతంలో కొండపై మట్టిని తవ్వారు. ప్రస్తుతం నిర్మాణాలు జరుగుతున్నాయి. అయితే ఇప్పుడు గత వారం రోజులుగా అక్కడ యంత్రాలతో మట్టిని తవ్వుతున్నారు. ఇవి అనధికారమని అందరికీ తెలుసు. ఎవరైనా ప్రశ్నిస్తే జగనన్న కాలనీల కోసం అని చెబుతున్నారు. అక్కడితో ఆగలేదు. అదే కొండపై చివరన సర్వే నంబరు 68లో స్థానిక వైసీపీ నేతలు అనధికారికంగా ... మిగతా 4వ పేజీలో



దుస్తులతో ఉన్న సంచి అందజేస్తున్న ఉత్తర నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు

వైసీపీ నేతల ఎన్నికల తాయిలాలు

- ఉత్తర నియోజకవర్గంలో బూత్ లెవెల్ మీటింగులు
- అక్కడే దుస్తుల పంపిణీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో సహకారం కావాలని సచివాలయాల సిబ్బందికి, వలంటీర్లకు, ముఖ్య కార్యకర్తలకు అధికార పార్టీ నేతలు తాయిలాలు పంచుతున్నారు. భీమిలి నియోజకవర్గంలో సంక్రాంతి బహుమతి పేరుతో సచివాలయ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఉత్తర నియోజకవర్గంలో ఈ పంపిణీ చురుగ్గా సాగుతోంది. నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే రాజు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, ముఖ్య కార్యకర్తలతో బూత్ లెవెల్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఓటర్ల జాబితాలు, కుటుంబాల వివరాలు తెలుసుకుంటున్నారు. చక్కటి సేవలు అందిస్తున్నారని వారిని ప్రశంసిస్తూ వారికి చీర/ప్యాంటు+షర్టు ఉన్న సంచిని వేదికపైనే బహూకరిస్తున్నారు. ఆ సంచిపై కేకే రాజు ఫొటో ముద్రించి మరీ ... మిగతా 4వ పేజీలో

కానిస్టేబుల్ పోస్టులపై కదలిక ఏది?

ఈ ఐదేళ్లలో ఒక్కసారి మాత్రమే నోటిఫికేషన్

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో నిరుద్యోగుల పరిస్థితి దయనీయంగా ఉంది. గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా డీఎస్సీ నిర్వహించని వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆదరాబాదరాగా నోటిఫికేషన్ ఇచ్చింది. ఇది ఎన్నికల స్టంట్‌గానే అభ్యర్థులు చూస్తున్నారు. ఇక పోలీస్ శాఖలో ఖాళీల భర్తీకి ఐదేళ్లలో ఒకే ఒక్కసారి నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం...దానిని కూడా సాఫీగా పూర్తిచేయలేకపోయింది.

- 2023 జనవరిలో ప్రాథమిక పరీక్ష నిర్వహణ
- అర్హత సాధించిన 95 వేల మంది
- ఉమ్మడి జిల్లాలో 12 వేల మంది...
- కోర్టు కేసులతో నిలిచిన తదుపరి ప్రక్రియ
- పరిష్కారానికి చొరవ చూపని ప్రభుత్వం
- శారీరక దారుఢ్య, మెయిన్స్ పరీక్షల కోసం ఏడాది కాలంగా నిరీక్షిస్తున్న అభ్యర్థులు



రాష్ట్రంలో 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం 2022 నవంబరులో నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 2023 జనవరిలో ప్రాథమిక పరీక్షను నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా 4,59,182 మంది హాజరు కాగా, 95,208 మంది అర్హత సాధించారు. వారికి ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ ఈవెంట్స్‌ను నిర్వహించడంతోపాటు మెయిన్స్ పరీక్షను నిర్వహించాల్సి ఉంది. ఈలోగా కొందరు హోంగార్డులు పలు అంశాలపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయించారు. అయితే ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి చొరవచూపకపోవడంతో నియామక ప్రక్రియ ముందుకుసాగడం లేదు. ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు గడిచిన ఏడాది కాలం నుంచి నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించి మిగిలిన ఈవెంట్స్, మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని కోరుతున్నారు. ఎన్నికల్ కోడ్ వచ్చేలోగా నియామక ప్రక్రియ పూర్తిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉమ్మడి విశాఖలో 12 వేల మంది

ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 12 వేల మంది అభ్యర్థుల ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించి ఫిజికల్ టెస్ట్, మెయిన్స్ కోసం నిరీక్షిస్తున్నారు. వీరంతా గడిచిన ఏడాది కాలం నుంచి ఇళ్లకు దూరంగా ఉంటూ ప్రిపరేషన్‌లో ఉన్నారు. వయసు దాటిపోయేలా ఉందని, ఈ ఒక్క నోటిఫికేషన్‌తో అదృష్టాన్ని పరీక్షించుకుందామంటే ప్రక్రియ ముందుకు సాగడం లేదని శివ అనే అభ్యర్థి ఆవేదన వ్యక్తం చేశాడు. ఐదేళ్లలో కానిస్టేబుల్ పోస్టులను ఒక్కసారి కూడా భర్తీచేయని ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోతుందని ఆగ్రహాన్ని వ్యక్తంచేశాడు. ఈ నోటిఫికేషన్ చేయి దాటిపోతే కొత్త ప్రభుత్వాలు నోటిఫికేషన్ ఇచ్చే అవకాశమే లేదని, కనీసం రెండు, మూడేళ్ల సమయం పడుతుందని, అప్పటికి వయసు అయిపోతుందని నాగార్జున అనే యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ నోటిఫికేషన్ ... మిగతా 4వ పేజీలో

ప్రజారోగ్య ప్రయోగశాల పనితీరుపై పెదవివిరుపు

- సమయపాలన పాటించని అధికారులు

ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో కూడా తెలియని పరిస్థితి



ఖాళీగా ఉన్న ఆహార పదార్థాలు పరీక్షించే ల్యాబ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పెదవాల్తేరులో గల ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాల పనితీరు నిరాశజనకంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ల్యాబ్‌కు సాధారణంగా ఆహార భద్రత, ప్రమాణాల విభాగానికి చెందిన అధికారులు తాము సేకరించిన నమూనాలను పరీక్షల కోసం పంపిస్తారు. అలాగే రైల్వే, జీవీఎంసీ, ప్రభుత్వ, ప్రైవేటు వసతి గృహాల నుంచి కొన్నిసార్లు నమూనాలను అధికారులు తీసుకువచ్చి పరీక్షలు చేయిస్తుంటారు. వ్యక్తిగతంగా కూడా నమూనాలు తెచ్చి పరీక్షలు చేయించుకోవచ్చు. ఇక్కడి అధికారుల పనితీరు సవ్యంగా ఉంటే ప్రతిరోజూ పదుల సంఖ్యలో నమూనాలు వచ్చేందుకు అవకాశం ఉంది. కానీ, ఈ ల్యాబ్‌లో పనిచేసే ఇద్దరు అధికారుల్లో ఒకరు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి నెలకొంది. మరో జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ పక్కనే నిర్మాణమవుతున్న ల్యాబ్ భవన నిర్మాణ పనులు పర్యవేక్షిస్తుంటారు. ట్రైనింగ్ ప్రోగ్రామ్ వంటి వాటికి వెళుతుంటారు. ఖాళీ సమయాల్లో ఆయన పరీక్షలు చేస్తుంటారు. ఈ ల్యాబ్‌లో నెలకు 30 నుంచి 40 నమూనాలు ... మిగతా 4వ పేజీలో



కోడికత్తి శ్రీనివాస్ విడుదల

వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిపై ఐదేళ్ల క్రితం విశాఖ విమానాశ్రయంలో కోడికత్తితో దాడి చేసిన కేసులో అరెస్టయిన జనుపల్లి శ్రీనివాస్ ఎట్టకేలకు శుక్రవారం జైలు నుంచి విడుదలయ్యాడు. - మెయిన్‌లో



ఆశ కార్యకర్తల ఆందోళన

తమ డిమాండ్ల సాధనకు ఆశ కార్యకర్తలు శుక్రవారం విధులను బహిష్కరించారు. సీఐటీయూ కార్యాలయం నుంచి సరస్వతి పార్కు, దసపల్లా మీదుగా జగదాంబ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడే సుమారు గంటపాటు ధర్నా చేపట్టారు. - వార్త III పేజీలో



క్రీడాకారుల కష్టాలు

'ఆడుదాం ఆంధ్రా'...ఫైనల్స్ కోసం నగరానికి వచ్చిన క్రీడాకారులు తొలిరోజు శుక్రవారం చాలా ఇబ్బందిపడ్డారు. ఉదయం 9.15 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని అధికారులు ప్రకటించడంతో జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను 8.30 గంటలకే నగరంలోని రైల్వే స్టేడియానికి తరలించారు. ముఖ్య అతిథులు తీరిగ్గా 10.30 గంటలకు వచ్చారు. క్రీడాకారులతో పరిచయాలు, అతిథులు ప్రసంగాలు పూర్తయ్యేసరికి 12 గంటలు దాటింది. అప్పటివరకూ ఎండలో కూర్చున్న క్రీడాకారులు నీరసించిపోయారు. ఇక ప్రారంభోత్సవం అనంతరం క్రీడాకారులను విడిది కేంద్రాలకు తీసుకువెళ్లేందుకు బస్సులు సకాలంలో రాకపోవడంతో వారంతా రోడ్లపై కూర్చుని నిరీక్షించాల్సి వచ్చింది. కొంతమంది రెండు గంటల వరకూ అక్కడే ఉండిపోయారు.

19న 'విశ్వనాథ్ స్వరాభిషేకం'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి, తదితరులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 9: కళాతపస్వీ విశ్వనాథ్ స్వరాభిషేకం పేరిట సినీ సంగీత విభావరిని ఈ నెల 19న ఎంవీఆర్ ఈవెంట్స్, యాక్షి స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విశాఖలోని కళాభారతిలో నిర్వహిస్తున్నట్లు సీనియర్ గాయకులు ఎంవీఆర్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను హైదరాబాద్‌లో విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి ఆవిష్కరించారన్నారు.కిన్నెర థియేటర్స్ అధినేత రఘురాం, ప్లే బ్యాక్ సింగర్ నేమాని పార్థసారథి, యాక్షి ప్రతాప్‌కుమార్‌ఉన్నారు.

ప్రధాని మోదీ తీరును ప్రశ్నించాలి

▸ ఏఐసీసీ కార్యదర్శి ప్రణవ్ జా



మాట్లాడుతున్న ప్రణవ్ జా

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 9: ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం చేస్తున్న ఆకృత్యాలను దేశపౌరులంతా ప్రశ్నించాలని ఏఐసీసీ కార్యదర్శి, కమ్యూనికేషన్ విభాగ ఇన్‌చార్జి ప్రణవ్ జా ప్రజలకు పిలుపునిచ్చారు. ఢిల్లీ నుంచి విశాఖ పర్యటనకు విచ్చేసిన ఆయన రైల్వేన్యూకాలనీ సమీపం టీఎస్ఎన్ కాలనీలోని ఓహోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అగ్నిపథ్ పేరిట ఉద్యోగాలంటూ నమ్మించి కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని, ఈ పోటీల్లో 50 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అనేకచోట్ల ఆర్మీ ర్యాలీలు నిర్వహించినా ఇప్పటికీ ఉద్యోగాల కోసం ఎంతోమంది చూస్తున్నారన్నారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలో విజయదుందుభి మోగించిన కాంగ్రెస్ పార్టీ ఏపీలోనూ అత్యధిక మెజార్టీ సాధించి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వేగి వెంకటేష్, గొంప గోవింద్, తిలారి సురేష్, చినాబు, హైదరాలి సింకా తదితరులు పాల్గొన్నారు.



నక్కవానిపాలెం మార్గంలో బురదనీటిలో వెళ్తున్న వాహనదారులు



ఇళ్ల ముందు అడ్డదిడ్డంగా తవ్విన గోతులు

రోడ్డుపైనే.. మురుగు నీరు

▸ 24వ వార్డులో కాలువ పునర్నిర్మాణ పనులతో తిప్పలు

▸ యథేచ్ఛగా తవ్వకాలతో రాకపోకలకు అవస్థలు

సీతమ్మధార, ఫిబ్రవరి 9: జీవీఎంసీ ఇష్టానుసారం చేపడుతున్న నిర్మాణ పనులతో స్థానికులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. గ్రేటర్ 24వ వార్డులో కాలువ పునర్నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇళ్ల ముందు జేసీబీతో ఇష్టం వచ్చినట్లు కాలువలు తవ్వి వదిలివేస్తున్నారు. దీంతో ఇళ్లలోని వారు బయటకు, లోనికి వెళ్లడానికి అవస్థలు ఎదుర్కొంటున్నారు. తవ్విన గోతులకు ప్రత్యామ్నాయంగా కాలువలో పూడిక వెళ్లడానికి వీలుగా చర్యలు తీసుకోకపోవడంతో మురుగు రోడ్డుపైకి వచ్చేస్తోంది. నక్కవానిపాలెంనకు వెళ్లే ఎదుట రోడ్డుకాలువలో రోడ్డుపై కొద్ది రోజులుగా ఇదే పరిస్థితి ఉంది. ఆ మురుగు నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. పాదచారులునడవడానికిఇబ్బంది ఎదుర్కొంటున్నారు.వాహనాలు వెళ్లే సమయంలో పక్కన వెళ్తున్న వారిపై మురుగునీరంతా తుళ్లుతోంది. దుర్గంధంతో స్థానికుల అవస్థలు వర్ణనాతీతం. ఈ మార్గంలో నక్కవానిపాలెం, మద్దిలపాలెం, కేఆర్ఎం కాలనీ, సీతమ్మధార వెంకటేశ్వర స్వామి ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో ప్రజలు ప్రయాణిస్తుంటారు. ఇంత మంది సమస్యతో బాధపడుతున్నా సంబంధిత కాంట్రాక్టర్, జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి.

రోడ్డులో మురుగునీరు సుమారు అరకిలోమీటరు మేరవాగులా ప్రవహిస్తోంది. నక్కవానిపాలెం ప్రారంభంలో మద్యం దుకాణం ఉండటం, ఇక్కడ కాలువపై గట్ల నిర్మాణంతోపాటు కాలువలో ప్లాస్టిక్ గ్లాసులు, చెత్తాచెదారం నిలిచి మురుగునీరు రహదారిపై వస్తోంది. నివాసితులు ఇళ్లలోనుంచి ఎలా వస్తారో కూడా ఆలోచించకుండా జేసీబీతో అడ్డదిడ్డంగా తవ్వేస్తున్నారు. త్వరితగతిన పనులు చేపట్టి సమస్యలు పరిష్కారించాలని స్థానిక ప్రజలు జీవీఎంసీ అధికారులను వేడుకుంటున్నారు.

సినిమాలతో మభ్యపెట్టాలని చూడడం అవివేకం

▸ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్



సమావేశంలో మాట్లాడుతున్న మహ్మద్ నజీర్

మహారాణిపేట, ఫిబ్రవరి 9: అవినీతి సొమ్ముతో వైసీపీ నాయకులు సినిమాలు తీసి ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి మహ్మద్ నజీర్ ఆరో పించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో గెలవటం కోసం యాత్ర పేరిట సినిమా తీసి, అదేదో ప్రజలకు గొప్ప సేవ చేస్తున్నట్లు వైసీపీ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ప్రజలు ఈ సినిమాను తిరస్కరించారన్నారు. అందుకే థియేటర్లు 20 శాతం కూడా నిండటంలేదని ఎద్దేవా చేశారు. ఎన్ని కుయుక్తులు పన్నినా, ముఖ్యమంత్రి జగన్‌ను ఓడించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నా రన్నారు.అనేక సర్వే రిపోర్టులుఇదే స్పష్టంచేస్తున్నాయన్నారు. ఈసమావేశంలో పార్టీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు బైరెడ్డి పోతనరెడ్డి, అబ్దుల్ చిన్న రహమాన్, బొడ్డేటి మోహన్, మహ్మద్ జపురుల్లా, మహ్మద్ గౌస్, పొడుగు కుమార్, పెద్దాడ పైడిరాజు తదితరులున్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ పేరిట దగా

▸ 'ఉత్తర' జనసేన నాయకురాలు ఉషాకిరణ్ ధ్వజం



మాట్లాడుతున్న ఉషాకిరణ్

కంచరపాలెం, ఫిబ్రవరి 9 : డీఎస్సీ నోటిఫికేషన్ పేరిట నిరుద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం దగా చేస్తోందని ఉత్తర జనసేన నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్ విమర్శించారు. జీవీఎంసీ 54వ వార్డులో శుక్రవారం జనసైనికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు..ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీచేస్తామని హామీ ఇచ్చిన జగన్...నాలుగున్నరేళ్లగా ఒక్క ఉద్యోగం భర్తీచేయలేదన్నారు. రాష్ట్రంలో సుమారు 30వేల ఉపాధ్యాయ ఖాళీలుండగా కేవలం ఎన్నికలు వస్తున్నాయనే నెపంతో..6100 పోస్టులకు నోటిఫికేషన్‌ను ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయన్నారు. సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామన్న హామీనిఅటకెక్కించారన్నారు. వార్డు అధ్యక్షులు వింజుమూర్తి భాస్కర్,స్వర్ణలత ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో దివాకర్, సీతారాం, లక్ష్మీమాణిక్యాలరావు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో పిల్లల్లో సంపూర్ణ ఆరోగ్యం



మాత్రలు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 9 : పిల్లల్లో నులి పురుగులు నియంత్రించి వారిని సంపూర్ణ ఆరోగ్యంతో ఉంచాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల వల్ల రక్త హీనత, పోషకాహార లోపం తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించి దివ్యాంగ విద్యార్థుల క్షేమసమాచారం తెలుసుకున్నారు. ఎంటీ పాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఎంఈవో డి.రామారావు, కేపీ బాలామణి, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి రమణ కుమారి, ఇన్‌చార్జ్ హెచ్ఎం ఆర్. శ్రీనివాసరావు, హెల్త్ సెక్రటరీ, ఎం. కమలమ్మ, ఉపాధ్యాయులు శారద, జగదాంబ పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి

▸ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు



వెంకటరావుకి కండువా వేస్తున్న విష్ణుకుమార్‌రాజు

మురళీనగర్, ఫిబ్రవరి 9 : ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల అభివృద్ధిలో వెనక్కి వెళ్లిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఆరోపించారు. ఉత్తర నియోజకవర్గ పరిధి 50వ వార్డులోని మాధవధార తెన్నేటినగర్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. వార్డు ప్రజలతో మమేకమై సమస్యలను తెలుసుకున్నారు. గతంలో నియోజకవర్గంలో తాను అభివృద్ధి చేసిన పనులే నేటికీ కనపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రముఖ ప్రాంతమైన విశాఖను జగన్ నిర్వీర్యం చేశారన్నారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు 50వవార్డు పార్టీ అధ్యక్షులు కూన.వెంకటరావు, నార్త్ కన్వీనర్ సురేష్‌బాబు, కార్యకర్తలు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

అక్కయ్యపాలెం: జిల్లా మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి షేక్ నూర్ బాషా షరీఫ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకం విశ్వకర్మ యోజన, ప్రధాని మోదీ అమలుచేస్తున్న మైనార్టీలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై రైల్వేన్యూకాలనీలో శుక్రవారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతాడ మోహనరావు, జిల్లా అధ్యక్షురాలు భారతి, కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి



జగదీశ్వరరావు (ఫైల్)

సీతంపేట, ఫిబ్రవరి 9: నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆటో డ్రైవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. రైల్వే న్యూ కాలనీ వెంకటేశ్వర కాలనీలో ఉంటున్న జక్కంపూడి జగదీశ్వరరావు (51) ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్నారు. కొద్దికాలం క్రితం కుమార్తె తేజశ్విని కాకినాడలో బంధువుల ఇంటి వద్ద మేడపై నుంచి పడిపోయి మృతి చెందింది. అప్పటినుంచి జగదీశ్వరరావు మనస్తాపంతో ఉంటున్నారు. ఈ క్రమంలో ఆయన భార్య కనకమహాలక్ష్మివిజయనగరంలో ఈ నెల 5వ తేదీన బంధువుల ఇంటికి వెళ్లింది. అదేరోజుపురుగుమందు జగదీశ్వరరావు తాగడంతో ఆస్పత్రికి తరలించారు. గురువారం రాత్రి చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి ప్రమాద రహిత జిల్లాగా మార్చాలి

▸ కలెక్టర్ మల్లికార్జున



జెండా ఊపి ట్రాఫిక్ వాహనాలు ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట, ఫిబ్రవరి 9: విశాఖ ప్రమాద రహిత జిల్లాగా రూపుదిద్దాలని కలెక్టర్ ఏ మల్లికార్జున, నగర పోలీసు కమిషనర్ ఏ రవిశంకర్ ఆకాక్షించారు. శుక్రవారం ఆర్కే బీచ్ కాళీ మాత ఆలయం సమీపంలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా సీఎస్ఆర్ నిధులు రూ. 57 లక్షలతో కొనుగోలు చేసిన 32 ట్రాఫిక్ మోటారు సైకిల్స్, ఓ క్రేన్ వాహనాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా, రూ. 30 కోట్లతో రహదారిప్రమాదాల నివారణలో భాగంగా పలు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గతంలో కంటే ఈ ఏడాది ప్రమాదాలు తగ్గు ముఖం పట్టాయని తెలిపారు. 2023లో రహదారి ప్రమాదాల నివారణలో రాష్ట్రస్థాయిలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా సంస్థ రూ. కోటి సీఎస్ఆర్ నిధులతో కేజీహెచ్, విక్టోరియా ఆస్పత్రుల్లో సోలార్ ప్యానల్స్ చిన్న పిల్లల వసతిగృహాల కోసం వెచ్చిస్తున్నట్లు తెలిపారు. రూ. 57 లక్షలతో 33 ట్రాఫిక్ వాహనాలను పోలీసు శాఖకు అందించిందన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ పోలీసు కమిషనర్ ఫకీరప్ప , పోలీసులు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణమండపం పనులకు శంకుస్థాపన

అల్లిపురం, ఫిబ్రవరి 9: జీవీఎంసీ 32వ వార్డు చలువతోటలో సుమారు 80.78 లక్షల అంచనా వ్యయంతో కల్యాణమండపం నిర్మాణానికి శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డు వైసీపీ నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రైతుబజారులో శనగపప్పు విక్రయాలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 9 : గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతు బజారులో కేంద్ర ప్రభుత్వ సహకారంతో వినియోగదారులకు భారత్ డా ల్ పేరిట కిలో శనగపప్పు రూ.60కే విక్రయాలను శుక్రవారం ఎస్టేట్ అధికారి పి. చినబాబు ప్రారంభించారు. ఈ మేరకు సూపర్ బజారు స్టాల్స్‌లో విక్రయించేందుకు మూడు బస్తాలు సిద్ధంగా ఉన్నట్టు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో సహాయకుడు ఆర్. సత్యనారాయణ, ఎం.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

16న బంద్‌ను జయప్రదం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు



మాట్లాడుత్ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 9: రోడ్డు రవాణా డ్రైవర్లకు ఉరితాడుగా మారిన మోటారు ట్రాన్స్‌పోర్టు సవరణ చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న సమ్మె నిర్వహిస్తున్న నేపథ్యంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, విశాఖ లారీఆపరేటర్స్, క్వారీ లారీ, ఆటో, మోటారు ఆపరేటర్స్ సంఘాల నాయకులు శుక్రవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా నరసింగరావు రవాణా రంగాన్ని, రహదారులను నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ కింద ప్రైవేట్‌కు కేంద్ర ప్రభుత్వం ధారదత్తం చేస్తోందని ఆరోపించారు. ఓనర్ కమ్ డ్రైవర్స్‌ను లేకుండా చేయడమే కేంద్రం లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా మోటారు ట్రాన్స్‌పోర్టు సెక్షన్ 106 తదితర చట్టాల ద్వారా అనేక దాడులు చేస్తున్నారన్నారు. పెట్రోల్‌కు పన్ను మినహాయింపు ఇవ్వాలని, రవాణా రంగ కార్మికులకు రక్షణ కల్పించేలా సమగ్ర సంక్షేమ చట్టాన్ని చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16నచేపడుతున్న సమ్మెలో డ్రైవర్లంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి. రాజుకుమార్, బి.జగన్, జి.అప్పలరాజు, కె.సత్యనారాయణ, శివ, అప్పుడు, శ్రీనివాసరావు, విశ్వనాథం, రమణ, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అల్లిపురం, ఫిబ్రవరి 9: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న నిర్వహించనున్న గ్రామీణబంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పోస్టర్లు ఆవిష్కరించారు. స్టీల్‌ప్లాంట్, పోర్టులు,విమానాశ్రయాలు, రైల్వేలు, చమురు సంస్థలు, గనులు, రక్షణ రంగాలను కేంద్రం కార్పొరేట్ వర్గాలకు కట్టబెట్టాలని చూస్తోందన్నారు. జి ల్లా నాయకులు ఎం.మన్మథరావు, జె.రామకృష్ణ, ఎస్.కె. రహమాన్, ఎన్.లక్ష్మణరావు, ఎం.శ్రీనివాసరావు, బి.అశోక్ పాల్గొన్నారు.

జగదాంబ కూడలి: ఈనెల 16న జరగనున్న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. శుక్రవారం జగదాంబ వద్ద సిటు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిటు జిల్లా నాయకుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, కార్మిక సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు డి.అప్పారావు, సీఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు ఎన్.కనకారావు.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 5.09 లక్షల మందికి అల్బెండాజోల్ మాత్రలు

▸ డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

సీతమ్మధార, ఫిబ్రవరి 9: జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో ఉన్న 5,20,891 పిల్లల్లో 5,09,440 మందికి శుక్రవారం నులిపురుగుల మాత్రలు పంపిణీ చేసి 97.8 శాతం పూర్తి చేసినట్టు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి పి. జగదీశ్వరరావు తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం పురస్కరించుకుని సీతమ్మధార టీఅండ్‌టీ కాలనీలోని ఎస్ఎంసీహెచ్ పాఠశాలలో డీఎంహెచ్‌వో.. డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రశాంతితో కలిసి విద్యార్థులకు నులిపురుగులు మాత్రలను వేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ... మొత్తం జిల్లాలో పిల్లలకు ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల్లో వైద్య సిబ్బంది ద్వారా ఈ మాత్రలను వేయించినట్టు వివరించారు. ఇంకా, మాత్రలు తీసుకోని విద్యార్థులకు ఈ నెల 16వతేదీన వేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీ ఎస్‌కే కోఆర్డినేటర్, ఇన్‌చార్జి డాక్టర్ నరేశ్‌కుమార్, జీవీఎంసీ డీపీవో శశిభూషణ్, వైద్య ఆరోగ్య సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

20న నాలుగు గుడుల అమ్మవార్ల జాతర



అమ్మవార్లు

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 9: నగరంలోని సూపర్ బజార్‌కు సమీపాన నూట ఏభై ఏళ్లనాటి పురాతన నాలుగు గుడుల్లో ముత్యాలమ్మ, పోలే రమ్మ, సత్తమ్మ, భూలోకమ్మ అమ్మవార్లు కొలువుతీరి ఉన్నారు. ఈ అమ్మవార్లకు ఈనెల 20 తేదీన ఉత్సవాలు నిర్వహించనున్నారు. పదేళ్లకోమారు నిర్వహించే ఈ ఉత్సవాలకు ఆలయం సిద్ధమవుతోంది.సూపర్‌బజార్ మెయిన్ రోడ్డువిశాలాంధ్ర బుక్‌హౌస్‌వైపు చిన్న లింకు రోడ్డులోఈ గుళ్లు ఉన్నాయి.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి: ఎస్ఐ



మాట్లాడుతున్న ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార, ఫిబ్రవరి 9: ప్రతి విద్యార్థీ విధిగా తమ తల్లిదండ్రులు ట్రాఫిక్ రూల్స్ పాటించేలా అవగాహన కల్పించాలని ద్వారకా పోలీసు స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు తెలిపారు.సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని ఎస్ఎం సీహెచ్ పాఠశాలలో ట్రాఫిక్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'లిప్'ను పక్కాగా అమలు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా టీం మెంబర్

కంచరపాలెం, ఫిబ్రవరి 9 : లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్) ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలని ఎంఈవో సోమశేఖర్ సూచించారు. లిప్ ప్రోగ్రాం అమలులో భాగంగా ఆయన జిల్లా రీసోర్సుపర్సన్స్ బృందంతో కలిసి ఆర్పీపేట పాఠశాలను శుక్రవారం సందర్శించారు. లిప్ కార్యక్రమం ద్వారా తెలుగు, గణితం, సైన్స్ ఇంగ్లీష్, సోషల్ తదితర సబ్జెక్టుల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను అందిస్తున్నట్టు చెప్పారు. ఈమేరకు పాఠశాల హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావుతో కలిసి పలు తరగతుల్లో బోధనను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. రీసోర్సు పర్సన్లు చుక్‌బాబు, దయానంద్,జానకీరాం, త్రినాధరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎడాపెడా మట్టి తవ్వకాలు

... 3వ పేజీ తరువాయి

ఒక లేఅవుట్ వేసి ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. అక్కడ ఇంటి స్థలం రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు విక్రయిస్తున్నారు. ఈ సంగతి కూడా అధికారుల దృష్టిలో ఉంది. కానీ చర్యలు తీసుకోవడం లేదు. అంతా వైసీపీ నేతలే చేస్తున్నారని తప్పించుకుంటున్నారు.

ఆనందపురంలో...

ఆనందపురంలో కూడా ఇలాగే జగనన్న కాలనీ పేరుతో కొండను తవ్వేస్తున్నారు. జట్లమ్మ కొండగా వ్యవహరించే ఈ కొండపై 'ఆనందపురం' అంటూ ఇంగ్లీష్ అక్షరాలు ఉంటాయి. గతంలో అక్కడ 109 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. దాంతో ఆ ప్రాంతాన్ని నిర్మాణాలకు అనువుగా తవ్వుకున్నారు. ఇప్పుడు రెండు వారాల నుంచి 'జగనన్న కాలనీ' అంటూ ఆ కొండను తవ్వేసి మట్టిని తరలించుకుపోతున్నారు. ప్రతి చోట వినియోగించినట్టే ఇక్కడ కూడా భారీ యంత్రాలతో మట్టిని తవ్వుతున్నారు. ఆ భూమిని చదును చేశాక వైసీపీ నేతలు ప్లాట్లుగా వేసి అమ్మకానికి పెడతారని చెబుతున్నారు. తక్షణమే ఇక్కడి పనులు ఆపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కొందరు అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. చర్యలు చేపట్టడానికి వారు వెనకాడుతున్నారు.

కానిస్టేబుల్ పోస్టులపై కదలిక ఏది?

... 3వ పేజీ తరువాయి

ఇవ్వడమే ప్రభుత్వానికి ఇష్టం లేనట్టుందని, అందుకే అడ్డంకులను సాకుగా చూపి ప్రక్రియను నిలిపివేసిందని మరికొంతమంది ఆరోపిస్తున్నారు. గడిచిన కొన్నేళ్ల నుంచి ఎన్నో ప్రభుత్వాలను చూశామని, నిరుద్యోగులకు అన్యాయం చేసిన ఏకైక ప్రభుత్వంగా ఇది మిగిలిపోతుందని రామారావు అనే మరో అభ్యర్థి తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశాడు. ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 3,580 సివిల్, 2,520 ఏపీఎస్పీ కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. విశాఖ సిటీ పరిధిలో 187, గ్రామీణ జిల్లా పరిధిలో 159 సివిల్ కానిస్టేబుల్ పోస్టులు ఉన్నాయి.

వైసీపీ నేతల ఎన్నికల తాయిలాలు

... 3వ పేజీ తరువాయి

ఇవ్వడం గమనార్హం. వార్డుల వారీగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తాజాగా అక్కయ్యపాలెం షాదీఖానాలో శుక్రవారం సుమారు 300 మందికి ఈ బహుమతులు అందించారు. వాటిని తీసుకున్నవారు బయటకు వచ్చి ఎలాంటి రంగులు వచ్చాయో చూసుకున్నారు. అవన్నీ స్థానికులు ఆసక్తిగా గమనించడంతో వెంటనే మళ్లీ సంచిలో వాటిని పెట్టేసుకున్నారు. జిల్లా యంత్రాంగం వీటిని ఎన్నికల తాయిలాలుగా పరిగణించి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఉత్తర నియోజకవర్గం బీజేపీ నాయకులు విష్ణుకుమార్‌రాజు ప్రశ్నిస్తున్నారు.

ప్రజారోగ్య ప్రయోగశాల పనితీరుపై పెదవివిరుపు

... 3వ పేజీ తరువాయి

మాత్రమే పరీక్షిస్తారంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యం..

ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ కంట్రోల్‌లో పనిచేస్తుంది. ఈ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ పోస్టు గడిచిన కొన్నాళ్ల నుంచి ఖాళీగా ఉంది. దీంతో అధికారులపై పర్యవేక్షణ లేకుండా పోయింది. ఇదే ప్రయోగశాలలో నీటిని పరీక్షించే మరో ల్యాబ్‌లో పనిచేసే సీనియర్ అనలిస్ట్(వాటర్)కు డిప్యూటీ డైరెక్టర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. సెక్షన్లు వేరు కావడంతో ఆయన ఇన్‌చార్జి అయినప్పటికీ ఏమీ చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు. దీంతో ఫుడ్ ల్యాబ్‌లో సిబ్బంది ఆడిందే ఆట, పాడిందే పాట అన్న చందంగా పరిస్థితి తయారైంది. దీనిపై ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న సదరు అధికారిని వివరణ కోరగా 'వస్తుంటారండి' అంటూ సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారు.

పీవీకి భారతరత్నపై శారదా పీఠాధిపతి హర్షం

పెందుర్తి, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడంపై శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం పీఠం శ్రీకార్యం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా పీఠాధిపతి పీవీతో ఉన్న అనుబంధం గుర్తు చేసుకున్నారు. ఆర్థిక సంస్కరణలకు బీజం వేసి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన గొప్ప దార్శనికుడు పీవీ అన్నారు. ఆయన సేవలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించి గుర్తించిందన్నారు. ఇది తెలుగు రాష్ట్రాల ప్రజలు గర్వించదగ్గ విషయమన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

అగనంపూడి, ఫిబ్రవరి 9: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ సూచించారు. శ్రీరంగనగర్, మరిడిమాంబ కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. అనారోగ్య సమస్యలుంటే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం మలేరియా సిబ్బందితో గ్రామాల్లో ఫాగింగ్ నిర్వహించారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పప్పల మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్య సమాజం

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 9: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవ సమాజం సాధ్యమని జెడ్‌సీ ప్రసాదరావు అన్నారు. 87వవార్డు తిరుమలనగర్‌లో శుక్రవారం కాలనీ నివాసితుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛభారత్‌లో పాల్గొన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కోరారు. తడి పొడి చెత్తను వేరుచేసి అందించాలన్నారు. దోమల నివారణ, మొక్కల పెంపకం, ఇంకుడు గుంతలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, పరమేశ్వరరావు, మూర్తి, సన్యాసిరావు, ఎస్ఐ అప్పారావు, రంగయ్యనాయుడు, వసంత రెడ్డి పాల్గొన్నారు.

కల్వర్టు పనుల పరిశీలన

పెదగంట్యాడ, ఫిబ్రవరి 9: స్థానిక ప్రధాన కూడలిలోని శిథిల కల్వర్టు పునరుద్ధరణ పనులను 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి శుక్రవారం పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. రహదారిపై రాకపోకలు సాగించే పాదచారులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయం చూపిస్తూనే పనులు పూర్తి చేయాలన్నారు. ట్రేడ్ యూనియన్ నేత బసా సాధూరెడ్డి, వార్డు టీడీపీ కార్యదర్శి దొమ్మేటి పెరుమాళ్లు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

పెదగంట్యాడ, ఫిబ్రవరి 9: ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులను శుక్రవారం జీవీఎంసీ 76వ వార్డు రామచంద్రానగర్‌లో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గాజువాక వైసీపీ ఇన్‌చార్జి ఉరుకూటి రామచంద్రరావు, సింహాచలం దేవస్థానం ట్రస్టీ దొడ్డి రమణ వీటిని పంపిణీ చేశారు. 76వ వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, షావుకారు శరత్, కుమార్, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించండి

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 9: స్టీల్‌ప్లాంట్‌లోని కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ కాంట్రాక్టు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మంత్రి రవి నేతృత్వంలో నాయకులు శుక్రవారం ఉక్కు అధికారులకు వినతి పత్రం అందజేశారు. కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. 60ఏళ్ల పైబడిన కార్మికులను విధుల నుంచి తొలగించే సమయంలో వారికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని విన్నవించారు.

పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

వేపగుంట, ఫిబ్రవరి 9: బైబిల్ మిషన్ సమృద్ధి గృహ ప్రార్థనామందిరంలో బైబిల్ మిషన్ వ్యవస్థాపకుడు సెయింట్ ఎం.దేవదాసు 64వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రార్థనలు చేశారు. దేవదాసు కులమతాలకు అతీతంగా సేవచేసిన గొప్ప వ్యక్తని రెవెరెండ్ ఫాదర్ సీహెచ్ సుందరరావు పేర్కొన్నారు. అనంతరం నిరుపేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డేనిష్ అబ్రహం, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ట్రూ లవర్ :** శ్రీకన్య, వెంకటేశ్వర, గోకుల్, , శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక)
- **ఈగల్ :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **లాల్ సలామ్ :** మెలోడి, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **యాత్ర-2 :** సంగం, కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), శ్రీన్య (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** శారద, లక్ష్మీకాంత్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** రమాదేవి, లీలామహల్, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **నా సామిరంగ :** శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 17, టమాటా 25, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 38, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 48, బీరకాయలు 44, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 24, క్యారెట్ 20, దొండకాయలు 40, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 110, బరబాటి 26, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 36, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 60, చిలగడదుంపలు 32, కంద 54, దేముడు చిక్కుడు 30, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	112
ఫారం ధర	--	132
విత్ స్కిన్	--	234
స్కిన్‌లెస్	--	244

మరికొన్ని సిటీ వార్తలు పేజీIIIలో..

సేంద్రియ సాగు... ఆదాయం బాగు!

- విస్తారంగా కూరగాయల సాగు
- సేంద్రియ ఎరువుల వినియోగంతో సత్ఫలితాలు
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 9: ఆహార పంటలకు అవసరమైన నీటి వసతులు లేకపోవడంతో పలు గ్రామాల వాసులు కూరగాయల సాగును ఆశ్రయిస్తున్నారు. ఏడాది పొడవునా తక్కువ నీటితో పంటల సాగుకు అనుకూలంగా ఉండడం, మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతుండడంతో కూరగాయల సాగు లాభాల పంట పండుతోంది. దీనికి ఉద్యానవన శాఖ అధికారుల సహాయం అందుతుండడంతో వారి సూచనల మేరకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు కళ్లజూస్తున్నామని రైతులు చెబుతున్నారు.

దువ్వాడ, సంధ్యానగర్, వెదుళ్లనరవ, గంగవరం,


గంగవరంలో టమాటా పంట


దువ్వాడలో సాగు చేస్తున్న ఆకు కూరలు

కొత్తూరు తదితర గ్రామాల్లో బోరుబావులు, మోటార్లు ఉండడంతో రైతులంతా కూరగాయల సాగుపైనే దృష్టి సారించి మంచి ఫలితాలను సాధిస్తున్నారు. ప్రధానంగా వంగ, బెండ, బరబాటి, టమటా, గోరుచిక్కుడు, బీర, కాకరకాయ, క్యాబేజీ తదితరాలతో పాటు ఆకు కూరలను కూడా సాగుతుచేస్తున్నారు. వందల ఎకరాల్లో కూరగాయల పంటలను పండిస్తున్నారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పండించిన కూరగాయలను గాజువాక, సింధియా, పూర్ణామార్కెట్, తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఉద్యానవన శాఖ అధికారుల సలహాలు, సూచనలను పాటిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్


సంధ్యానగర్‌లో మిర్చి పంటను సాగు చేస్తున్న దృశ్యం

ఉన్న కూరగాయాలను పండిస్తుండడంతో మంచి ధర పలుకుతున్నాయని చెబుతున్నారు. సాగు లాభదాయకంగా ఉందని, ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో కూరగాయల సాగుపైనే దృష్టిసారించినట్టు తెలిపారు.

సేంద్రియ ఎరువులతోనే మేలు



కూరగాయల సాగులో సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టిసారించాం. దీనిద్వారా అధిక దిగుబడులు లభిస్తున్నాయి. పైగా వినియోగదారులకు ఆరోగ్యం. దీంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ పలుకుతున్నాయి. ఆవు పేడ, కూరగాయల వ్యర్థాలను ఓ చోట పోగు చేసి భద్రపరుస్తున్నాం. వీటితో సేంద్రియ ఎరువులను తయారు చేసి పొలాలకు వేస్తున్నాం. దీంతో దిగుబడులు ఎక్కువగా వస్తున్నాయి.

\- ఎస్.శ్రీను, రైతు, దువ్వాడ

టీడీపీతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు

- పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 9: రాష్ట్రంలో వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయి, ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 87 వార్డు కణితిలో శుక్రవారం రాత్రి నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే రానున్న ఎన్నికల్లో వైసీపీకి చరమ గీతం పాడి, టీడీపీ అధినేత చంద్రబాబుకు పట్టం కట్టాలని పిలుపు నిచ్చారు. జగన్‌ను ఇంటికి పంపించే సమయం ఆసన్నమైందన్నారు. బొండా జగన్ మాట్లాడుతూ కక్ష సాధింపులు, అక్రమాలు, అరాచకాలు తప్ప ప్రజలకు వైసీపీ పాలనలో ఒరిగిందేమి లేదన్నారు. ప్రజలు ప్రశాంతంగా బతకాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, శ్రీనివాస వర్మ, సత్తిబాబు, పెంటారావు, రాజన్‌రాజు,తదితరులు పాల్గొన్నారు.


భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పల్లా శ్రీనివాసరావు, బొండా జగన్

కేసుల నుంచి బయట పడేందుకే స్టీల్‌ప్లాంట్ తాకట్టు

గాజువాక: ముఖ్యమంత్రి జగన్ కేసుల నుంచి బయటపడేందుకు స్టీల్‌ప్లాంట్‌ను తాకట్టు పెట్టారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం 75, 86వ వార్డు బూత్ కమిటీ, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ విషయంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను జగన్ అవలంబిస్తున్నారని ఆరోపించారు. దుర్మార్గ పాలనకు రోజులు దగ్గరపడ్డాయన్నారు. సమావేశంలో సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నేతలు పులి వెంకటరమణారెడ్డి, నమ్మి అప్పారావు, మాడిస కనకరాజు, పెంటయ్య, పెద్దాడ సోమినాయుడు పాల్గొన్నారు.

'ఆశ కార్యకర్తల నిర్బంధం అన్యాయం'



నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ వర్కర్లు

గాజువాక, ఫిబ్రవరి 9: ఆశ వర్కర్స్‌పై ప్రభుత్వ నిర్బంధం తగదని సీఐటీయూ నాయకులు అన్నారు. సమస్యలపై చలో విజయవాడకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేకంగా శుక్రవారం గాజువాకలో వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆశ వర్కర్‌లను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. వారి సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటాలు చేస్తామన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ శనివారం విధులు బహిష్కరిస్తామన్నారు. జగ్గునాయుడు, రాజేంద్రప్రసాద్, మణి, హేమలత పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

ఎన్.ఎ.డీ.జంక్షన్ ఫిబ్రవరి 9: బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ నిరాశ్రయుల షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న 40 మందికి భారత చైతన్య యువజన పార్టీ నేత నమ్మి అప్పలరాజు యాదవ్ శుక్రవారం దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారమే తమ పార్టీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో షెల్టర్ నిర్వాహకురాలు ఎల్లేటి మమత, జిల్లా సమన్వయ సారథి అల్లు రమణయాదవ్, తోట బుజ్జి, రామారావు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఐక్య పోరాటాలతోనే విజయం'


దీక్షలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 9: పోరాటాలతోనే విజయం వరిస్తుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు అన్నారు. కూర్మన్నపాలెంలో 1092వ రోజు రిలే నిరాహార దీక్షలో మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ అమ్మేయాలని కంకణం కట్టుకున్నారని, దీనికి వ్యతిరేకంగా కార్మికులు ఐకమత్యంతో పోరాడాలన్నారు. పోరాట కమిటీ నాయకులు తాండ్ర కనకరాజు మాట్లాడుతూ స్టీలుప్లాంట్ ప్రైవేటీకరణ బాధాకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కరరావు, శ్రీనివాస్, గంగవరం గోపి, వి.ప్రసాద్, గోపాల్ రాజు, ఆనంద్, మొయిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో స్టీల్‌ప్లాంట్ అంశం ప్రస్తావించాలి

ఉక్కుటౌన్‌షిప్: పార్లమెంట్ సమావేశంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని ఎంపీలు ప్రస్తావించాలని, ఇదే ప్రధాన ఎజెండాగా మారాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్టానికి చెందిన ఎంపీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని చిత్తశుద్ధితో పార్లమెంట్‌లో ప్రస్తావించడం లేదన్నారు. నరేంద్ర, చీపురుపల్లి శ్రీనివాస్, అప్పారావు పాల్గొన్నారు.

'కార్మిక సమ్మెను విజయవంతం చేయాలి'

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 9: కార్మిక సమస్యల పరిష్కారానికి, ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలనే ప్రధాన డిమాండ్లతో ఈ నెల 16న స్టీల్ ప్లాంట్‌లో చేపట్టనున్న కార్మిక సమ్మె విజయవంతం చేయాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక నాయకులు పేర్కొన్నారు. ప్లాంట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రకటన వచ్చి మూడేళ్లయిందన్నారు. దీనిపై ఎన్ని పోరాటాలు చేస్తున్నా నేటి వరకు కేంద్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఢిల్లీలో చేపట్టనున్న ధర్నాతోనైనా కేంద్ర ప్రభుత్వం స్పందించాలన్నారు. వేతన సవరణ విషయంలో కార్మికులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారన్నారు. కార్మిక సమస్యలు పరిష్కారంలో యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేఎస్ఎన్.రావు, జె.అయోధ్యరాం, నీరుకొండ రామచంద్రరావు, జి.గణపతిరెడ్డి, సన్యాసిరావు, నమ్మి సింహాద్రి పాల్గొన్నారు.


హెచ్‌పీసీఎల్ వద్ద మాట్లాడుతున్న నాగభూషణం

బంద్ జయప్రదం చేయాలి

మల్కాపురం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేకవిధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న నిర్వహించనున్న కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం కోరారు. శుక్రవారం హెచ్‌పీసీఎల్ సీ గేటు వద్ద జరిగిన సమావేశంలో ఆయనపాల్గొని మాట్లాడారు. విశాఖ ఉక్కుపరిశ్రమతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలన్నారు. అసంఘటిత రంగంలోని కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని కోరుతూ యాజమాన్యాలకు సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.తాతాబాబు, నరసింగరావు, అగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్


సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రదర్శనలు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 9: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్‌లు దోహదపడతాయని ప్రధానోపాధ్యాయుడు పీవీఎస్ఎస్ ఆంజనేయ అన్నారు. కోరమాండల్ కంపెనీ సహకారంతో మింది హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఇందులో విద్యార్థులు 35 సైన్స్ నమూనాలు ప్రదర్శించగా, వాటిలో నాల్గింటిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపికచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కోరమాండల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలి

అక్కిరెడ్డిపాలెం: విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులది కీలకపాత్ర అని గాజువాక ఎంఈవో విశ్వనాథం అన్నారు. మింది హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన అభ్యసన అభివృద్ధి పథకం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన అభ్యసనంలో మెలకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో అగనంపూడి హైస్కూల్ హెచ్ఎం కృష్ణారావు, మింది హైస్కూల్ హెచ్ఎం పీవీఎస్ ఆంజనేయ, సబ్జెక్టు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : సీఐ

సింధియా, ఫిబ్రవరి 9: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని మల్కాపురం శాంతి భద్రతల విభాగం సీఐ ఎస్.సన్యాసినాయుడు పేర్కొన్నారు. జైఆంధ్రాకాలనీలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన నేరనియంత్రణ అవగాహన సదస్సులో మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు ఉన్నా, వినియోగిస్తున్నట్టు సమాచారం ఉంటే 100కు ఫోన్‌చేసి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం


పల్లకిలో షిర్డీ సాయి బాబా విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 9: శాతవాహన్ నగర్ బాబా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శ్రీలక్ష్మి గణపతి, శ్రీకృష్ణ, శ్రీదత్తాత్రేయ, ధుని సహిత శ్రీ షిర్డీ సాయి నాథుని ఈ ఆలయ 19 వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం అర్చకులు ఇరగవరపు శ్రీధర్ పర్యవేక్షణలో సాయినాథునికి కాగడా హారతి, క్షీరాభిషేకం, అలంకరణ అర్చన, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వాచనం, అఖండ దీపారాధన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. భక్తులు సుందరాకాండ పారాయణం, భజన గీతాలు ఆలపించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. రాత్రి భక్తులు రొట్టెలు తయారుచేసి బాబాకు నివేదించిన అనంతరం భక్తులకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కాట్రగడ్డ దుర్గా ప్రసాద్, బండ్రెడ్డి శేషగిరిరావు, మేకా శ్రీనివాసరావు, చిరట్ల సాయిరాం, ధనుంజయ రెడ్డి, జగపతిరాజు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌కు కాంగ్రెస్ నేతల అభినందనలు

గాజువాక, ఫిబ్రవరి 9: గాజువాక జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్‌ను స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకులు చెల్లుబోయిన నాయుడు నేతృత్వంలో పలువురు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. గాజువాకలో నెలకొన్న ప్రధాన సమ్యలు పరిష్కరించాలన్నారు. డంపింగ్ యార్డ్, కాలుష్య సమస్య లతో ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. డ్రైనేజీలు నిర్మించాలని, పారిశుద్ధ్య సమస్య లేకుండా చేయాలని కోరారు. అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో నెల్లి అప్పలరాజు, రమణబాబు, రవికుమార్ పాల్గొన్నారు.

వంతెనపై నిలిచిపోయిన ట్రాఫిక్

- ప్రయాణికులకు ఇబ్బందులు



వంతెనపై నిలిచిపోయిన ట్రాఫిక్

మల్కాపురం, ఫిబ్రవరి 9: ఎస్ఆర్ కంపెనీ నుంచి కాన్వెంట్ జంక్షన్‌కు వెళ్లే వంతెనపై శుక్రవారం ట్రాఫిక్ నిలిచిపోయింది. మిలాన్ నేపథ్యంలో ఈ వంతెనపై పనులుచేపడుతుండడంతో వాహనాలు నిలిచిపోయి, ప్రయాణీకులు పడరానిపాట్లు పడ్డారు. రాత్రివేళల్లో చేపట్టాల్సిన పనులు పగలు చేపడుతుండడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. అలాగే, రోడ్డుపైనే ఇసుక, పిక్క వేయడంతో ప్రయాణికులు జారిపడుతున్నారు. మిలాన్ జరుగనున్న నేపథ్యంలో డాక్‌యార్డు వై జంక్షన్ సమీపంలో రోడ్డు నిర్మాణం పనులుజోరుగా సాగుతున్నాయి. సింధియా, ఫైప్‌లైన్ జంక్షన్ సమీపంలోనూ రోడ్డు, ఫుట్‌పాత్, సెంటర్ డివైడర్ పనులుసాగుతున్నాయి. జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణలో ఈపనులు చేపడుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పనులు పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు.

ఎస్టీబీఎల్‌లో ఘనంగా శాంతి కల్యాణం


కొత్త నక్కవాని పాలెంలో కలశాలతో మహిళల ఊరేగింపు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 9: శ్రవణా నక్షత్రం సందర్భంగా శుక్రవారం శీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు, శాంతి కల్యాణం నిర్వహించారు. స్వామి వారిని పంచామృతాలతో అభిషేకించిన అనంతరం భక్తులు ఊరేగింపుగా తీసుకువచ్చిన పుష్పాలు, నగలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేక వేదికపై శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామివారిని ప్రతిష్ఠించి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పూజలలో పాలకమండలి సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి శ్రవణా నక్షత్రం పూజలు

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలువైన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రవణా నక్షత్రం పూజలు నిర్వహించారు. బంటా కాలనీకి చెందిన పైడిరాజు, రాజశేఖర్,మోక్షిత, జగదీస్,రామసాయిలు ఆర్థిక సహాయంతో అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. వీరికి అర్చకులు స్వామివారి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, సన్యాసిరావు, వర్మ, రాజేంద్ర, శ్రీహరి, సుజాత, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభనగర్‌లో తీర్థ మహోత్సవం

గోపాలపట్నం: స్థానిక పద్మనాభనగర్‌లోని సీతారామ సహిత విశాలాక్షి, విశ్వేశ్వర విజయగణపతి ఆలయ తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల దర్శనాలు ప్రారంభించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం గ్రామంలో పరస నిర్వహించారు. రాత్రి గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రీవారికి పంచామృతాభిషేకాలు

పెందుర్తి: వెంకటాద్రి శిఖరంపై కొలువైన వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మూలవిరాట్టుకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పాలు,పెరుగు, నెయ్యి, నీరు, తేనె సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వామికి వజ్రాలంకరణ చేశారు.


ఎస్టీబీఎల్‌లో స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించిన దృశ్యం

కనక దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ

మల్కాపురం: గ్రేటర్ 59వ వార్డు కొత్తనక్కావానిపాలెం కనకదుర్గాదేవి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా సాగింది. ఈసందర్భంగా కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ, పుర్రె సురేశ్ పూజలు చేశారు. మహిళలు కలశాలతో ఆలయానికి ఊరేగింపుగా చేరుకుని పూజల్లో పాల్గొన్నారు. 11వ తేదీ వరకు పండగ ఉంటుందని నిర్వహకులు తెలిపారు.

19న 'విశ్వనాథ్ స్వరాభిషేకం'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి, తదితరులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 9: కళాతపస్వీ విశ్వనాథ్ స్వరాభిషేకం పేరిట సినీ సంగీత విభావరిని ఈ నెల 19న ఎంవీఆర్ ఈవెంట్స్, యాక్షి స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విశాఖలోని కళాభారతిలో నిర్వహిస్తున్నట్లు సీనియర్ గాయకులు ఎంవీఆర్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను హైదరాబాద్‌లో విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి ఆవిష్కరించారన్నారు.కిన్నెర థియేటర్స్ అధినేత రఘురాం, ప్లే బ్యాక్ సింగర్ నేమాని పార్థసారథి, యాక్షి ప్రతాప్‌కుమార్‌ఉన్నారు.

ప్రధాని మోదీ తీరును ప్రశ్నించాలి

» ఏఐసీసీ కార్యదర్శి ప్రణవ్ జా



మాట్లాడుతున్న ప్రణవ్ జా

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 9: ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం చేస్తున్న అకృత్యాలను దేశపౌరులంతా ప్రశ్నించాలని ఏఐసీసీ కార్యదర్శి, కమ్యూనికేషన్ విభాగ ఇన్‌చార్జి ప్రణవ్ జా ప్రజలకు పిలుపునిచ్చారు. ఢిల్లీ నుంచి విశాఖ పర్యటనకు విచ్చేసిన ఆయన రైల్వేన్యూకాలనీ సమీపం టీఎస్ఎన్ కాలనీలోని ఓహోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అగ్నిపథ్ పేరిట ఉద్యోగాలంటూ నమ్మించి కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని, ఈ పోటీల్లో 50 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అనేకచోట్ల ఆర్మీ ర్యాలీలు నిర్వహించినా ఇప్పటికీ ఉద్యోగాల కోసం ఎంతోమంది చూస్తున్నారన్నారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలో విజయదందుభి మోగించిన కాంగ్రెస్ పార్టీ ఏపీలోనూ అత్యధిక మెజార్టీ సాధించి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వేగి వెంకటేష్, గొంప గోవింద్, తిలారి సురేష్, చినాబు, హైదరాలి సింకా తదితరులు పాల్గొన్నారు.



నక్కవానిపాలెం మార్గంలో బురదనీటిలో వెళ్తున్న వాహనదారులు



ఇళ్ల ముందు అడ్డదిడ్డంగా తవ్విన గోతులు

రోడ్డుపైనే.. మురుగు నీరు

» 24వ వార్డులో కాలువ పునర్నిర్మాణ పనులతో తిప్పలు

» యథేచ్ఛగా తవ్వకాలతో రాకపోకలకు అవస్థలు

సీతమ్మధార, ఫిబ్రవరి 9: జీవీఎంసీ ఇష్టానుసారం చేపడుతున్న నిర్మాణ పనులతో స్థానికులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. గ్రేటర్ 24వ వార్డులో కాలువ పునర్నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇళ్ల ముందు జేసీబీతో ఇష్టం వచ్చినట్లు కాలువలు తవ్వి వదిలివేస్తున్నారు. దీంతో ఇళ్లలోని వారు బయటకు, లోనికి వెళ్లడానికి అవస్థలు ఎదుర్కొంటున్నారు. తవ్విన గోతులకు ప్రత్యామ్నాయంగా కాలువలో పూడిక వెళ్లడానికి వీలుగా చర్యలు తీసుకోకపోవడంతో మురుగు రోడ్డుపైకి వచ్చేస్తోంది. నక్కవానిపాలెంనకు వెళ్లే ఎదుట రోడ్డుకాలువలో రోడ్డుపై కొద్ది రోజులుగా ఇదే పరిస్థితి ఉంది. ఆ మురుగు నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. పాదచారులునడవడానికిఇబ్బంది ఎదుర్కొంటున్నారు.వాహనాలు వెళ్లే సమయంలో పక్కన వెళ్తున్న వారిపై మురుగునీరంతా తుళ్లుతోంది. దుర్గంధంతో స్థానికుల అవస్థలు వర్ణనాతీతం. ఈ మార్గంలో నక్కవానిపాలెం, మద్దిలపాలెం, కేఆర్‌ఎం కాలనీ, సీతమ్మధార వెంకటేశ్వర స్వామి ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో ప్రజలు ప్రయాణిస్తుంటారు. ఇంత మంది సమస్యతో బాధపడుతున్నా సంబంధిత కాంట్రాక్టర్, జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి.

రోడ్డులో మురుగునీరు సుమారు అరకిలోమీటరు మేరవాగులా ప్రవహిస్తోంది. నక్కవానిపాలెం ప్రారంభంలో మద్యం దుకాణం ఉండటం, ఇక్కడ కాలువపై గట్ల నిర్మాణంతోపాటు కాలువలో ప్లాస్టిక్ గ్లాసులు, చెత్తాచెదారం నిలిచి మురుగునీరు రహదారిపై వస్తోంది. నివాసితులు ఇళ్లలోనుంచి ఎలా వస్తారో కూడా ఆలోచించకుండా జేసీబీతో అడ్డదిడ్డంగా తవ్వేస్తున్నారు. త్వరితగతిన పనులు చేపట్టి సమస్యలు పరిష్కారించాలని స్థానిక ప్రజలు జీవీఎంసీ అధికారులను వేడుకుంటున్నారు.

సినిమాలతో మభ్యపెట్టాలని చూడడం అవివేకం

» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్



సమావేశంలో మాట్లాడుతున్న మహ్మద్ నజీర్

మహారాణిపేట, ఫిబ్రవరి 9: అవినీతి సొమ్ముతో వైసీపీ నాయకులు సినిమాలు తీసి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి మహ్మద్ నజీర్ ఆరోపించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో గెలవటం కోసం యాత్ర పేరిట సినిమా తీసి, అదేదో ప్రజలకు గొప్ప సేవ చేస్తున్నట్టు వైసీపీ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ప్రజలు ఈ సినిమాను తిరస్కరించారన్నారు. అందుకే థియేటర్లు 20 శాతం కూడా నిండటంలేదని ఎద్దేవా చేశారు. ఎన్ని కుయుక్తులు పన్నినా, ముఖ్యమంత్రి జగన్‌ను ఓడించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నా రన్నారు.అనేక సర్వే రిపోర్టులుఇదే స్పష్టంచేస్తున్నాయన్నారు. ఈసమావేశంలో పార్టీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు బైరెడ్డి పోతనరెడ్డి, అబ్దుల్ చిన్న రహమాన్, బొడ్డేటి మోహన్, మహ్మద్ జపురుల్లా, మహ్మద్ గౌస్, పొడుగు కుమార్, పెద్దాడ పైడిరాజు తదితరులున్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ పేరిట దగా

» 'ఉత్తర' జనసేన నాయకురాలు ఉషాకిరణ్ ధ్వజం



మాట్లాడుతున్న ఉషాకిరణ్

కంచరపాలెం, ఫిబ్రవరి 9 : డీఎస్సీ నోటిఫికేషన్ పేరిట నిరుద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం దగా చేస్తోందని ఉత్తర జనసేన నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్ విమర్శించారు. జీవీఎంసీ 54వ వార్డులో శుక్రవారం జనసైనికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీచేస్తామని హామీ ఇచ్చిన జగన్...నాలుగున్నరేళ్లగా ఒక్క ఉద్యోగం భర్తీచేయలేదన్నారు. రాష్ట్రంలో సుమారు 30వేల ఉపాధ్యాయ ఖాళీలుండగా కేవలం ఎన్నికలు వస్తున్నాయనే నెపంతో..6100 పోస్టులకు నోటిఫికేషన్‌ను ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయన్నారు. సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామన్న హామీనిఅటకెక్కించారన్నారు. వార్డు అధ్యక్షులు వింజుమూర్తి భాస్కర్,స్వర్ణలత ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో దివాకర్, సీతారాం, లక్ష్మీమాణిక్యాలరావు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో పిల్లల్లో సంపూర్ణ ఆరోగ్యం



మాత్రలు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 9 : పిల్లల్లో నులి పురుగులు నియంత్రించి వారిని సంపూర్ణ ఆరోగ్యంతో ఉంచాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల వల్ల రక్త హీనత, పోషకాహార లోపం తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించి దివ్యాంగ విద్యార్థుల క్షేమసమాచారం తెలుసుకున్నారు. ఎంటీ పాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఎంఈవో డి.రామారావు, కేపీ బాలామణి, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి రమణ కుమారి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఆర్. శ్రీనివాసరావు, హెల్త్ సెక్రటరీ, ఎం. కమలమ్మ, ఉపాధ్యాయులు శారద, జగదాంబ పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి

» బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు



వెంకటరావుకి కండువా వేస్తున్న విష్ణుకుమార్‌రాజు

మురళీనగర్, ఫిబ్రవరి 9 ; ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల అభివృద్ధిలో వెనక్కి వెళ్లిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఆరోపించారు. ఉత్తర నియోజకవర్గ పరిధి 50వ వార్డులోని మాధవధార తెన్నేటినగర్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. వార్డు ప్రజలతో మమేకమై సమస్యలను తెలుసుకున్నారు. గతంలో నియోజకవర్గంలో తాను అభివృద్ధి చేసిన పనులే నేటికీ కనపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రముఖ ప్రాంతమైన విశాఖను జగన్ నిర్వీర్యం చేశారన్నారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు 50వవార్డు పార్టీ అధ్యక్షులు కూన.వెంకటరావు, నార్త్ కన్వీనర్ సురేష్‌బాబు, కార్యకర్తలు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

అక్కయ్యపాలెం: జిల్లా మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి షేక్ నూర్ బాషా షరీఫ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకం విశ్వకర్మ యోజన, ప్రధాని మోదీ అమలుచేస్తున్న మైనార్టీలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై రైల్వేన్యూకాలనీలో శుక్రవారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతాడ మోహనరావు, జిల్లా అధ్యక్షురాలు భారతి, కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి



జగదీశ్వరరావు (ఫైల్)

సీతంపేట, ఫిబ్రవరి 9: నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆటో డ్రైవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. రైల్వే న్యూ కాలనీ వెంకటేశ్వర కాలనీలో ఉంటున్న జక్కంపూడి జగదీశ్వరరావు (51) ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్నారు. కొద్దికాలం క్రితం కుమార్తె తేజశ్వని కాకినాడలో బంధువుల ఇంటి వద్ద మెడపై నుంచి పడిపోయి మృతి చెందింది. అప్పటినుంచి జగదీశ్వరరావు మనస్తాపంతో ఉంటున్నారు. ఈ క్రమంలో ఆయన భార్య కనకమహాలక్ష్మివిజయనగరంలో ఈ నెల 5వ తేదీన బంధువుల ఇంటికి వెళ్లింది. అదేరోజుపురుగుమందు జగదీశ్వరరావు తాగడంతో ఆస్పత్రికి తరలించారు. గురువారం రాత్రి చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి ప్రమాద రహిత జిల్లాగా మార్చాలి

» కలెక్టర్ మల్లికార్జున



జెండా ఊపి ట్రాఫిక్ వాహనాలు ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట, ఫిబ్రవరి 9: విశాఖ ప్రమాద రహిత జిల్లాగా రూపుదిద్దాలని కలెక్టర్ ఏ మల్లికార్జున, నగర పోలీసు కమిషనర్ ఏ రవిశంకర్ ఆకాక్షించారు. శుక్రవారం ఆర్‌కే బీచ్ కాళీ మాత ఆలయం సమీపంలో ఆర్సలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా సీఎస్ఆర్ నిధులు రూ. 57 లక్షలతో కొనుగోలు చేసిన 32 ట్రాఫిక్ మోటారు సైకిల్స్ ఓ క్రేన్ వాహనాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా, రూ. 30 కోట్లతో రహదారిప్రమాదాల నివారణలో భాగంగా పలు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. గతంలో కంటే ఈ ఏడాది ప్రమాదాలు తగ్గు ముఖం పట్టాయని తెలిపారు. 2023లో రహదారి ప్రమాదాల నివారణలో రాష్ట్రస్థాయిలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఆర్సలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా సంస్థ రూ. కోటి సీఎస్ఆర్ నిధులతో కేజీహెచ్, విక్టోరియా ఆస్పత్రుల్లో సోలార్ ప్యానల్స్ చిన్న పిల్లల వసతిగృహాల కోసం వెచ్చిస్తున్నట్టు తెలిపారు. రూ. 57 లక్షలతో 33 ట్రాఫిక్ వాహనాలను పోలీసు శాఖకు అందించిందన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ పోలీసు కమిషనర్ పకీరప్ప , పోలీసులు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణమండపం పనులకు శంకుస్థాపన

అల్లిపురం, ఫిబ్రవరి 9: జీవీఎంసీ 32వ వార్డు చలువతోటలో సుమారు 80.78 లక్షల అంచనా వ్యయంతో కల్యాణమండపం నిర్మాణానికి శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డు వైసీపీ నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రైతుబజారులో శనగపప్పు విక్రయాలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 9 : గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతు బజారులో కేంద్ర ప్రభుత్వ సహకారంతో వినియోగదారులకు భారత్ దా ల్ పేరిట కిలో శనగపప్పు రూ.60కే విక్రయాలను శుక్రవారం ఎస్టేట్ అధికారి పి. చినబాబు ప్రారంభించారు. ఈ మేరకు సూపర్ బజారు స్టాల్స్‌లో విక్రయించేందుకు మూడు బస్తాలు సిద్ధంగా ఉన్నట్టు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో సహాయకుడు ఆర్. సత్యనారాయణ, ఎం.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

16న బంద్‌ను జయప్రదం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు



మాట్లాడుత్ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 9: రోడ్డు రవాణా డ్రైవర్లకు ఉరితాడుగా మారిన మోటారు ట్రాన్స్‌పోర్టు సవరణ చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న సమ్మె నిర్వహిస్తున్న నేపథ్యంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, విశాఖ లారీఆపరేటర్స్, క్వారీ లారీ, ఆటో, మోటారు ఆపరేటర్స్ సంఘాల నాయకులు శుక్రవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా నరసింగరావు రవాణా రంగాన్ని, రహదారులను నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ కింద ప్రైవేట్‌కు కేంద్ర ప్రభుత్వం ధారదత్తం చేస్తోందని ఆరోపించారు. ఓనర్ కమ్ డ్రైవర్స్‌ను లేకుండా చేయడమే కేంద్రం లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా మోటారు ట్రాన్స్‌పోర్టు సెక్షన్ 106 తదితర చట్టాల ద్వారా అనేక దాడులు చేస్తున్నారన్నారు. పెట్రోల్‌కు పన్ను మినహాయింపు ఇవ్వాలని, రవాణా రంగ కార్మికులకు రక్షణ కల్పించేలా సమగ్ర సంక్షేమ చట్టాన్ని చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16నచేపడుతున్న సమ్మెలో డ్రైవర్లంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి. రాజుకుమార్, బి.జగన్, జి.అప్పలరాజు, కె.సత్యనారాయణ, శివ, అప్పడు, శ్రీనివాసరావు, విశ్వనాథం, రమణ, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అల్లిపురం, ఫిబ్రవరి 9: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న నిర్వహించనున్న గ్రామీణబంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పోస్టర్లు ఆవిష్కరించారు. స్టీల్‌ప్లాంట్, పోర్టులు,విమానాశ్రయాలు, రైల్వేలు, చమురు సంస్థలు, గనులు, రక్షణ రంగాలను కేంద్రం కార్పొరేట్ వర్గాలకు కట్టబెట్టాలని చూస్తోందన్నారు. జిల్లా నాయకులు ఎం.మన్మధరావు, జె.రామకృష్ణ, ఎస్.కె. రహమాన్, ఎన్.లక్ష్మణరావు, ఎం.శ్రీనివాసరావు, బి.అశోక్ పాల్గొన్నారు.

జగదాంబ కూడలి: ఈనెల 16న జరగనున్న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. శుక్రవారం జగదాంబ వద్ద సిటు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిటు జిల్లా నాయకుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, కార్మిక సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, హెచ్‌ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు డి.అప్పారావు, సీఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు ఎన్.కనకారావు,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 5,09 లక్షల మందికి అల్బొండాజోల్ మాత్రలు

» డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

సీతమ్మధార, ఫిబ్రవరి 9: జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో ఉన్న 5,20,891 పిల్లల్లో 5,09,440 మందికి శుక్రవారం నులిపురుగుల మాత్రలు పంపిణీ చేసి 97.8 శాతం పూర్తి చేసినట్టు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి పి. జగదీశ్వరరావు తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం పురస్కరించుకుని సీతమ్మధార టీఅండ్‌టీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ పాఠశాలలో డీఎంహెచ్‌వో.. డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రశాంతితో కలిసి విద్యార్థులకు నులిపురుగులు మాత్రలను వేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ... మొత్తం జిల్లాలో పిల్లలకు ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల్లో వైద్య సిబ్బంది ద్వారా ఈ మాత్రలను వేయించినట్టు వివరించారు. ఇంకా, మాత్రలు తీసుకోని విద్యార్థులకు ఈ నెల 16వతేదీన వేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీ ఎస్‌కే కోఆర్డినేటర్, ఇన్‌చార్జి డాక్టర్ నరేశ్‌కుమార్, జీవీఎంసీ డీపీవో శశిభూషణ్, వైద్య ఆరోగ్య సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

20న నాలుగు గుడుల అమ్మవార్ల జాతర



అమ్మవార్లు

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 9: నగరంలోని సూపర్ బజార్‌కు సమీపాన నూట ఏభై ఏళ్లనాటి పురాతన నాలుగు గుడుల్లో ముత్యాలమ్మ, పోలే రమ్మ, సత్తమ్మ, భూలోకమ్మ అమ్మవార్లు కొలువుతీరి ఉన్నారు. ఈ అమ్మవార్లకు ఈనెల 20 తేదీన ఉత్సవాలు నిర్వహించనున్నారు. పదేళ్లకోమారు నిర్వహించే ఈ ఉత్సవాలకు ఆలయం సిద్ధమవుతోంది.సూపర్‌బజార్ మెయిన్ రోడ్డువిశాలాంధ్ర బుక్‌హౌస్‌వైపు చిన్న లింకు రోడ్డులోఈ గుళ్లు ఉన్నాయి.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి: ఎస్ఐ



మాట్లాడుతున్న ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార, ఫిబ్రవరి 9: ప్రతి విద్యార్థి విధిగా తమ తల్లిదండ్రులు ట్రాఫిక్ రూల్స్ పాటించేలా అవగాహన కల్పించాలని ద్వారకా పోలీసు స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు తెలిపారు.సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని ఎన్ఎం సీహెచ్ పాఠశాలలో ట్రాఫిక్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'లిప్'ను పక్కాగా అమలు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా టీం మెంబర్

కంచరపాలెం, ఫిబ్రవరి 9 : లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్) ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలని ఎంవీవో సోమశేఖర్ సూచించారు. లిప్ ప్రోగ్రాం అమలులో భాగంగా ఆయన జిల్లా రీసోర్సుపర్సన్స్ బృందంతో కలిసి ఆర్పీపేట పాఠశాలను శుక్రవారం సందర్శించారు. లిప్ కార్యక్రమం ద్వారా తెలుగు, గణితం, సైన్స్, ఇంగ్లీష్, సోషల్ తదితర సబ్జెక్టుల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను అందిస్తున్నట్టు చెప్పారు. ఈమేరకు పాఠశాల హెచ్‌ఎం ఆర్‌శ్రీనివాసరావుతో కలిసి పలు తరగతుల్లో బోధనను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. రీసోర్సు పర్సన్లు చుక్‌బాబు, దయానంద్,జానకీరాం, త్రినాధరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎడాపెడా మట్టి తవ్వకాలు

... 3వ పేజీ తరువాయి

ఒక లేఅవుట్ వేసి ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. అక్కడ ఇంటి స్థలం రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు విక్రయిస్తున్నారు. ఈ సంగతి కూడా అధికారుల దృష్టిలో ఉంది. కానీ చర్యలు తీసుకోవడం లేదు. అంతా వైసీపీ నేతలే చేస్తున్నారని తప్పించుకుంటున్నారు.

ఆనందపురంలో...

ఆనందపురంలో కూడా ఇలాగే జగనన్న కాలనీ పేరుతో కొండను తవ్వేస్తున్నారు. జట్లమ్మ కొండగా వ్యవహరించే ఈ కొండపై 'ఆనందపురం' అంటూ ఇంగ్లీష్ అక్షరాలు ఉంటాయి. గతంలో అక్కడ 109 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. దాంతో ఆ ప్రాంతాన్ని నిర్మాణాలకు అనువుగా తవ్వకున్నారు. ఇప్పుడు రెండు వారాల నుంచి 'జగనన్న కాలనీ' అంటూ ఆ కొండను తవ్వేసి మట్టిని తరలించుకుపోతున్నారు. ప్రతి చోట వినియోగించినట్టే ఇక్కడ కూడా భారీ యంత్రాలతో మట్టిని తవ్వుతున్నారు. ఆ భూమిని చదును చేశాక వైసీపీ నేతలు ప్లాట్లుగా వేసి అమ్మకానికి పెడతారని చెబుతున్నారు. తక్షణమే ఇక్కడి పనులు ఆపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కొందరు అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. చర్యలు చేపట్టడానికి వారు వెనకాడుతున్నారు.

కానిస్టేబుల్ పోస్టులపై కదలిక ఏది?

... 3వ పేజీ తరువాయి

ఇవ్వడమే ప్రభుత్వానికి ఇష్టం లేనట్టుందని, అందుకే అడ్డంకులను సాకుగా చూపి ప్రక్రియను నిలిపివేసిందని మరికొంతమంది ఆరోపిస్తున్నారు. గడిచిన కొన్నేళ్ల నుంచి ఎన్నో ప్రభుత్వాలను చూశామని, నిరుద్యోగులకు అన్యాయం చేసిన ఏకైక ప్రభుత్వంగా ఇది మిగిలిపోతుందని రామారావు అనే మరో అభ్యర్థి తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశాడు. ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 3,580 సివిల్, 2,520 ఏపీఎస్పీ కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. విశాఖ సిటీ పరిధిలో 187, గ్రామీణ జిల్లా పరిధిలో 159 సివిల్ కానిస్టేబుల్ పోస్టులు ఉన్నాయి.

వైసీపీ నేతల ఎన్నికల తాయిలాలు

... 3వ పేజీ తరువాయి

ఇవ్వడం గమనార్హం. వార్డుల వారీగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తాజాగా అక్కయ్యపాలెం షాదీఖానాలో శుక్రవారం సుమారు 300 మందికి ఈ బహుమతులు అందించారు. వాటిని తీసుకున్నవారు బయటకు వచ్చి ఎలాంటి రంగులు వచ్చాయో చూసుకున్నారు. అవన్నీ స్థానికులు ఆసక్తిగా గమనించడంతో వెంటనే మళ్లీ సంచిలో వాటిని పెట్టేసుకున్నారు. జిల్లా యంత్రాంగం వీటిని ఎన్నికల తాయిలాలుగా పరిగణించి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఉత్తర నియోజకవర్గం బీజేపీ నాయకులు విష్ణుకుమార్‌రాజు ప్రశ్నిస్తున్నారు.

ప్రజారోగ్య ప్రయోగశాల పనితీరుపై పెదవివిరుపు

... 3వ పేజీ తరువాయి

మాత్రమే పరీక్షిస్తారంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యం..

ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ కంట్రోల్‌లో పనిచేస్తుంది. ఈ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ పోస్టు గడిచిన కొన్నాళ్ల నుంచి ఖాళీగా ఉంది. దీంతో అధికారులపై పర్యవేక్షణ లేకుండా పోయింది. ఇదే ప్రయోగశాలలో నీటిని పరీక్షించే మరో ల్యాబ్‌లో పనిచేసే సీనియర్ అనలిస్ట్(వాటర్)కు డిప్యూటీ డైరెక్టర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. సెక్షన్లు వేరు కావడంతో ఆయన ఇన్‌చార్జి అయినప్పటికీ ఏమీ చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు. దీంతో ఫుడ్ ల్యాబ్‌లో సిబ్బంది ఆడిందే ఆట, పాడిందే పాట అన్న చందంగా పరిస్థితి తయారైంది. దీనిపై ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న సదరు అధికారిని వివరణ కోరగా 'వస్తుంటారండి' అంటూ సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారు.

ముగిసిన వెంకన్న వైభవోత్సవాలు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 9 : ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో శ్రీవల్లభ వేంకటేశ్వరస్వామి ఆధ్యాత్మిక పీఠం, కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన వివంచి ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న వెంకన్న వైభవోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం నవకలశ స్థాపన,సాయంత్రం శ్రీవారి కల్యాణం, కుమారి జి.రిషిక కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. ఈ సందర్భంగా భక్తులకు రామకోటి రాయడానికి పుస్తకాలు పంపిణీ చేశారు.

కొనసాగుతున్న షణ్ముఖ శర్మ ఆధ్యాత్మిక ప్రవచనాలు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 9 : శ్రీరామ నామ సంకీర్తనలతో హనుమద్వైభవం సాక్షాత్కరిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఆరో సెక్టరు ఏబీసీ పార్కులో సామవేదం షణ్ముఖ శర్మ ఆధ్యాత్మిక ప్రసంగాలు శుక్రవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా జ్యోతిష్య నిపుణులు కందాళ వెంకట సత్యశ్యామ్, అరుణా గాయత్రి దంపతుల నేతృత్వంలో హనుమాన్ చాలీసా వ్యాఖ్యానాలు ఏర్పాటు చేశారు. ఉదయం 8.30 నుంచి 1 గంట వరకూ శ్రీరామ షడక్షర పూర్వక హనుమద్వైభవ మహాయాగం, సాయంత్రం 5.30 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, 6.30 నుంచి షణ్ముఖశర్మ ప్రసంగాలు నిర్వహించారు. అలాగే మానం లక్ష్మీ బృందం హనుమద్కీర్తనలు ఆలపించారు.

వెట్టి చాకిరీ నిర్మూలనపై పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 9 : ప్రభుత్వం ఫిబ్రవరి 9వ తేదీని వెట్టి చాకిరీ నిర్మూలన దినోత్సవంగా ప్రకటించాలని బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు డిమాండ్ చేశారు.శుక్రవారం ఆయన ఎంవీపీ కాలనీలోని ఎస్.వి.పి.పి.వి.ఎం.సి. డిగ్రీ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, ప్రియాంక, డాక్టర్ జ్ఞానేశ్వర బాబ్జి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు యోగా శిక్షణ

ఆరిలోవ, ఫిబ్రవరి 9 : ఆదర్శ నగర్ పాత డెయిరీ ఫారం వద్ద ఉన్న లిటిల్ కిడ్డీస్ ప్లే స్కూల్ ఆవరణలో ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు మహిళలకు ఉచిత యోగా శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రముఖ యోగా శిక్షకురాలు సులోచన తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిరోజూ ఉదయం 5 నుంచి 6 గంటల వరకు శిక్షణ ఉంటుందని,ఆసక్తి గల వారు 12వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 94935 28285, 95508 09688 సెల్ నంబర్లను సంప్రతించాలని ఆమె సూచించారు.

పీజీ పరీక్షా కేంద్రాలు పరిశీలన

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 9 : ఏయూ దూర విద్యా కేంద్రం ద్వారా జరుగుతున్న యూజీ, పీజీ పరీక్షా కేంద్రాలను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ శుక్రవారం పరిశీలించారు. ఈమేరకు ఆయన ఏవీఎన్ కళాశాలను సందర్శించి, పరీక్షలు నిర్వహిస్తున్న తీరును గమనించారు. ఆయనతో పాటు ఏయూ దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య విశ్వేశ్వరరావు, ఏవీఎన్ కళాశాల అధికారులు ఉన్నారు.

నేటి నుంచి హిందీ పరీక్షలు

భీమునిపట్నం, ఫిబ్రవరి 9 : చెన్నైకు చెందిన దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించే హిందీ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమవుతాయని ఆదర్శ హిందీ ప్రేమి మండలి అధ్యక్షుడు కృష్ణారావు తెలిపారు.శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 10న హిందీ హయ్యర్ గ్రేడ్ పరీక్షలు, 11న లోయర్ గ్రేడ్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఇందుకు సుభాష్ రోడ్డులో వున్న పండిట్ నెహ్రూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు.

స్థలం చదును పనులు అడ్డగింపు

తగరపువలస, ఫిబ్రవరి 9 : చిట్టివలస జూట్‌మిల్లు యాజమాన్యం తన ఆధీనంలో ఉన్న స్థలాన్ని చదును చేయిస్తుండగా కార్మికులు అడ్డుకున్నారు. మిల్లు యాజమాన్యం శుక్రవారం సర్వే నంబరు 10-1లో స్థల చదును పనులు చేయిస్తుండగా వివిధ కార్మిక సంఘాలకు చెందిన నాయకులు వెంకటరెడ్డి, వెంకటరమణ, ఆదినారాయణ, రాంపైడి, మద్దిల దేముళ్లు, నరవ రామారావు అడ్డుకున్నారు. కార్మికులకు పరిహారాలు చెల్లించకుండా స్థల చదును పనులు చేయడానికి వీల్లేదని యంత్రాలను వెనక్కి పంపించారు.

సినిమా గైడ్

- **ట్రూ లవర్ :** శ్రీకన్య, వెంకటేశ్వర, గోకుల్, , శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక)
- **ఈగల్ :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **లాల్ సలామ్ :** మెలోడి, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **యాత్ర-2 :** సంగం, కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), శ్రీన్య (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** శారద, లక్ష్మీకాంత్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** రమాదేవి, లీలామహల్, లక్ష్మీకాంత్ (గాజువాక)
- నా సామిరంగ : శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 17,టమాటా 25, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 38, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 48, బీరకాయలు 44, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 24, క్యారేట్ 20, దొండకాయలు 40, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 110, బరబటి 26, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 36, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 60, చిలగడదుంపలు 32 , కంద 54, దేముడు చిక్కుడు 30, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	112
ఫారం ధర	--	132
విత్ స్కిన్	--	234
స్కిన్‌లెస్	--	244

మరికొన్ని సిటీ వార్తలు పేజీ III లో..


శిథిలమై కింద పడి ఉన్న శిలాఫలకం


పార్కులో ఎక్కడ చూసినా.. ఇదే పరిస్థితి


బెంచీ కింద ఖాళీ మద్యం సీసాలు

చీకటి కార్యకలాపాలకు అడ్డా..

- అధ్వానంగా ఎండాడ ఎస్సీ కాలనీ పార్కు
- ఏళ్ల తరబడి నిర్వహణ కరువు
- ఎక్కడికక్కడే స్క్రాప్ దుకాణాలు ఏర్పాటు
- పేరుకుపోయిన చెత్త
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

ఎండాడ, ఫిబ్రవరి 9 : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడ ఎస్సీ, బీసీ కాలనీల్లో ఉన్న పార్కు అధ్వానంగా ఉంది. అధికారులు ఏళ్ల తరబడి పార్కు నిర్వహణను పట్టించుకోకపోవడంతో చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది.స్థానికుల విజ్ఞప్తి మేరకు గత టీడీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు లక్షలాది రూపాయలు వెచ్చించి స్థానికులకు ఆహ్లాదకరంగా ఉండేలా పార్కు ఏర్పాటు చేయించారు. మొదట్లో నిర్వహణ బాగున్నా.. తరువాత అధికారులు పట్టించుకోవడం మానేశారు. దీంతో స్క్రాప్ దుకాణదారులు పార్కుని అడ్డాగా మార్చుకుని సామగ్రి వేసి పరిసరాలను పాడు చేస్తున్నారు. మరోవైపు చీకటి పడిదంటే మందుబాబులు, గంజాయి తాగేవారు ఇక్కడికి వాలిపోతున్నారు. మందుబాబుల ఆగడాలకు భయపడి వాకర్స్ పార్కుకు రావాలంటే భయపడుతున్నారు. ఈ విషయమై వారు పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా..ఎవరూ పట్టించుకోవడం లేదు. అలాగే పార్కులో సందర్శకుల కోసం వేసిన బెంచీలు శిథిలమయ్యాయి.

పరిసరాల శుభ్రత అంతంతమాత్రమే

పార్కు చుట్టూ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాల్సిన పారిశుధ్యం సిబ్బంది ఇటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వచ్చి తూతూమంత్రంగా పని చేస్తున్నారు. పార్కు చుట్టూ ఉన్న దుకాణదారులు, పక్కనున్న హాస్టల్ యాజమాన్యం పార్కులో చెత్త వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. లోపల చెత్త పేరుకుపోవ డంతో విపరీతమైన దుర్వాసన వస్తోంది. పార్కులోకి వెళ్లే ప్రధాన ద్వారం కింద పడిఉన్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పార్కు నిర్వహణపై దృష్టిసారించడమే కాకుండా గేటు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భైరవస్వామికి అమావాస్య పూజలు


దీపారాధన చేస్తున్న భక్తులు (ఇన్‌సెట్లో) భైరవస్వామి

సింహాచలం, ఫిబ్రవరి 9 : అడవివరంలోని భైరవస్వామికి పుష్యమాస బహుళ పక్ష అమావాస్య పురస్కరించుకుని భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువజామున ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, చత్తీస్‌గఢ్, తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కొందరు క్షీరాభిషేకాలు చేయించుకోగా, మరికొందరు భస్మాభిషేకాలు, పంచామృతాలతో అభిషేకాలు జరిపించి వడమాలలు, నిమ్మకాయల మాలలను స్వామి కంఠాన అలంకరించారు. భక్తుల రద్దీని ముందుగా ఊహించిన దేవస్థానం ఈఓ సింగల శ్రీనివాసమూర్తి సిబ్బందిని అప్రమత్తం చేసి, కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకున్నారు. అలాగే శాంతి భద్రతల పరిరక్షణకు, ట్రాఫిక్ నియంత్రణకు గోపాలపట్నం రాణా పోలీసులు ఏర్పాట్లు చేశారు.

వెంకోజీపాలెం : కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేంచేసి ఉన్న కాలభైరవ స్వామికి అమావాస్య పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల భాస్కర శర్మ, నిర్వాహకులు బోర రమణరెడ్డి, ఎర్రాజీ రెడ్డి, గ్రామ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.


స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జడ్సీ శైలజ

నమ్మివానిపేటలో జెడ్సీ పర్యటన

తగరపువలస, ఫిబ్రవరి 9 : జీవీఎంసీ రెండో వార్డులోని పలు ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ జి. శైలజ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో కాలువలు, రోడ్లు నిర్మించాలని ప్రజలు విన్నవించారు. మధ్యలో వదిలేసిన పార్కు నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జెడ్సీ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసీపీ అధ్యక్షుడు గదదీసి సూరిబాబు, బీసీ సెల్ నాయకులు మాధవరావు, వంశీ, ఎస్. కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

అరకొర బస్సులతో అవస్థలు

సింహాచలం, ఫిబ్రవరి 9 : నగరంలో శుక్రవారం జరిగిన ఆడుదాం ఆంధ్ర రాష్ట్రస్థాయి పోటీల కోసం పలు డిపోల నుంచి బస్సులను పెద్ద సంఖ్యలో తరలించారు. దీంతో సింహాచలం నుంచి శొంఠ్యాం మీదుగా విజయనగరం వెళ్లే మార్గంలోని పలు విద్యా సంస్థల్లో చదువుకునే విద్యార్థులు, అదే మార్గంలో ఉద్యోగాలు చేసుకునేవారు, సాధారణ ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. అధికారులు బస్సులను అరకొరగా నడపడంతో అడివివరం కూడలి, సింహాచలం పీటీడీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించారు.

ఘనంగా లూర్థు మాత పండుగ

భీమునిపట్నం, ఫిబ్రవరి 9 : పట్టణంలోని సెయింట్ ఆన్స్ హోమ్ సిస్టర్స్ ఆధ్వర్యంలో లూర్థు మాత పండుగ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లూర్థు మాత ప్రతిమను అందంగా అలంకరించి, దేవుని తల్లికి వందనాలంటూ పలు గీతాలాపనలతో ఊరేగింపు చేపట్టారు.

నేడు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

పద్మనాభం, ఫిబ్రవరి 9 : కృష్ణాపురంలో శనివారం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం జరగనున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వేద పండితుడు సంతోష్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం పంచామృతాభిషేకాలు, 108 మందితో కుంకుమ పూజలు చేస్తారు. అనంతరం 102 కలశలతో అమ్మవారి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగిస్తారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, ఫిబ్రవరి 9 : విమ్స్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కైలాసగిరి ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఆపరేషన్ విభాగం ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బీఎస్ఆర్ నగర్, హనుమంతవాక, హనుమంతవాక కొండవాలు ప్రాంతం, తోటగరువు, రెవెన్యూ కాలనీ. విశాలాక్షినగర్, కైలాసగిరి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

సిరిపురం, ఫిబ్రవరి 9 : పెదవాల్తేర్‌లోని రామలక్ష్మీ అపార్ట్‌మెంట్‌లో హోళి వేమినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సత్యానంద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 98495 11544ను సంప్రతించాలని ఆయన సూచించారు.


పద్మనాభంలో మాట్లాడుతున్న భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్

పద్మనాభంలో భూహక్కు చట్టంపై అవగాహన

పద్మనాభం, ఫిబ్రవరి 9 : భూహక్కు యాజమాన్య చట్టంతో ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదని విశాఖపట్నం జిల్లా బార్ అసోసియేషన్ కన్వీనరు సత్యనారాయణ అన్నారు. భూహక్కు చట్టంలో ఉన్న లోపాలపై పద్మనాభంలో భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టం వల్ల ప్రజలు తమ ఆస్తులపై హక్కు కోల్పోతారన్నారు. చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసరావు, న్యాయవాదులు వేణుగోపాలరావు, టి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేసిన భూహక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దనరావు తెలిపారు. చిట్టివలస బంతాట మైదానంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టంపై అవగాహన లేకపోవడం వల్ల అనేక వివాదాలు జరుగుతున్నాయని, ప్రజల ఆస్తులపై ప్రభుత్వం పెత్తనం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బెవర సత్యనారాయణ, పి. శ్రీనివాసరావు, బాల భాస్కరావు, సూరిబాబు, సునీల్, సూర్యప్రకాష్, వాయునందన్, తదితరులు పాల్గొన్నారు.

పొట్నూరులో కుష్టు వ్యాధి నివారణపై ర్యాలీ

పద్మనాభం, ఫిబ్రవరి 9 : పొట్నూరు గ్రామంలో ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు కుష్టు వ్యాధి నివారణపై బ్రైట్ ఫ్యూచర్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డీసీఓ గురునాథ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి కుష్టు నివారణపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకరరావు, అప్పలరాజు, ఏఎన్ఎం పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

పెదవాల్తేరు, ఫిబ్రవరి 9 : తూర్పు నియోజకవర్గంలోని 18వ వార్డుకు చెందిన కబడ్డీ క్రీడాకారులకు లాసన్స్ బే కాలనీలోని తన కార్యాలయంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గానికి చెందిన కబడ్డీ క్రీడాకారులు రాష్ట్ర ఆడుదాం ఆంధ్ర రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు యూత్ వింగ్ వాసుపల్లి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే దేశాభివృద్ధి


మాట్లాడుతున్న గేదెల శ్రీనుబాబు

సిరిపురం, ఫిబ్రవరి 9 : యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని, గత 12 ఏళ్లలో సుమారు 50 లక్షల మంది పట్టభద్రులు ఇతర దేశాలకు వలస వెళ్లిపోయారని పల్సస్ సీఈఓ డాక్టర్ గేదెల శ్రీనుబాబు అన్నారు. శుక్రవారం సిరిపురం గురజాడ కళా క్షేత్రంలో జరిగిన యువశక్తి సదస్సులో ఆయన మాట్లాడారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి, వారికి మంచి భవిష్యత్తు అందించాలన్నదే తన లక్ష్యమన్నారు. పెట్టుబడులు, ఆవిష్కరణలపై సుదీర్ఘంగా ప్రసంగించారు. అనంతరం యువత అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం



కృష్ణ కళాశాలలో విద్యార్థినికి నులి పురుగుల నివారణ మాత్ర వేస్తున్న వైద్య సిబ్బంది

మద్దిలపాలెం, ఫిబ్రవరి 9 : నులి పురుగుల నివారణ ఆరోగ్యానికి మంచిదని డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. జయ అన్నారు. నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులి పురుగుల వల్ల బాలబాలికలు శారీరకంగా, మానసికంగా బలహీన పడతారన్నారు. 19 ఏళ్ల లోపు పిల్లలంతా తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు పోలఉమామహేశ్వరరావు, శామ్యూల్ డేవిడ్, జీవీ ప్రతాప్, బి. లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


మూలకుద్దులో బాలుడికి మాత్ర వేస్తున్న దృశ్యం

పద్మనాభంలో...

పద్మనాభం : మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. రేవిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పద్మనాభం, కృష్ణాపురం, రేవిడి, మద్ది, రెడ్డిపల్లి గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

భీమిలిలో...

భీమునిపట్నం : పట్టణంలోని పలు కళాశాలలు, పాఠశాలల్లో స్థానిక యూపీహెచ్‌సీ వైద్యులు విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యుడు చక్రవర్తి మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల నులి పురుగుల బారిన పడకుండా వుండవచ్చన్నారు. పిల్లలు చేతిగోళ్లు శుభ్రంగా వుండేలా చూసుకోవాలి, భోజనానికి ముందు చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. నులి పురుగుల వల్ల ఆకలి లేకపోవడం, రక్తహీనతకు గురవ్వడం, ఒక్కోసారి ప్రాణహాని కూడా జరిగే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీహో వై. మీనాక్షి, ఏఎన్ఎంలు కె. పైడిరాజు, ఎన్. పద్మ పాల్గొన్నారు. అలాగే మూలకుద్దు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంపీడీఓ జానకి, ఎంఈఓ శివరాణి నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు.

సింహాచలంలో..

సింహాచలం : జీవీఎంసీ 98 వార్డులోని పలు పాఠశాలల్లో వైద్య సిబ్బంది విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్పొరేటర్ పీవీ నరసింహం అడివివరంలో విద్యార్థులకు మాత్రలు వేశారు. ఈ సందర్భంగా సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రసాద్ నాయక్, రామిరెడ్డి మాట్లాడుతూ వార్డు పరిధిలో 1130 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు.


సిబ్బంది పరేడ్‌ను సమీక్షిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ

విశాలాక్షినగర్, ఫిబ్రవరి 9 : వచ్చే ఎన్నికల్లో ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. శుక్రవారం ఆయన కైలాసగిరి కొండ దిగువన ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ క్వార్టర్స్ మైదానంలో రిజర్వ్ పోలీసు సిబ్బంది పరేడ్‌ను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డబ్బు, మద్యం, గంజాయి అరికట్టేందుకు చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ చూపిన ఆర్మ్‌డ్ రిజర్వు డీఎస్పీ పి. నాగేశ్వరరావును ప్రశంసాపత్రంతో సత్కరించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సతీష్, రామకృష్ణారావు, వెంకట్రావు, అరవింద్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్రనగర్ కాలనీలో పార్కు ప్రారంభం

మధురవాడ, ఫిబ్రవరి 9 : జీవీఎంసీ ఏడో వార్డు స్వతంత్రనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన పార్కును ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడో వార్డులో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు.స్వతంత్రనగర్ కాలనీలో మూడున్నర ఎకరాల్లో రూ.2.5 కోట్లతో పార్కును ఏర్పాటు చేసినట్టు చెప్పారు. త్వరలోనే వార్డు పరిధిలో మరికొన్ని పార్కులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, వార్డు వైసీపీ అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల నిరసన


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూర్తి

తగరపువలస, ఫిబ్రవరి 9 : విజయవాడలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలు, నాయకుల్ని అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. అరెస్టులను ఖండిస్తూ తగరపువలసలో ఆశ కార్యకర్తలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ముందుగా ర్యాలీ చేసి, అనంతరం వైఎస్సార్ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూర్తి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేయడం సరికాదని, తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు సరస్వతి, పైడమ్మ, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గీతంలో 'సంయుక్త-24'

ఎండాడ, ఫిబ్రవరి 9 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విదేశీ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 16 వరకు సంయుక్త -24 పేరుతో అంతర్జాతీయ విద్యార్థుల యువజనోత్సవం నిర్వహించనున్నట్టు అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డైరెక్టర్ డాక్టర్ కేపీ కిషన్ తెలిపారు. శుక్రవారం గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ ఉత్సవానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఉత్సవంలో క్రీడా పోటీలతో పాటు సంగీత, నృత్య కార్యక్రమాలు, విదేశీ వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ లైఫ్ డీన్ ఎం. బాలాకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు సహస్రనామ తులసీ దళార్చన

సింహాచలం, ఫిబ్రవరి 9 : వరాహలక్ష్మీనృసింహస్వామికి సహస్ర నామ తులసీ దళార్చన శుక్రవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ సహస్ర నామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళాలతో అర్చన చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో స్వామివారి నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు.

రేఖవానిపాలెంలో 'పల్లెకు పోదాం'

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 9 : మండలంలోని రేఖవానిపాలెం గ్రామంలో బీజేపీ నాయకులు శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు ఆధ్వర్యంలో నాయకులు గ్రామంలో పర్యటించి, ప్రజలను సమస్యలు అడిగి తెలుసు కున్నారు. సచివాలయం, పోస్టల్ కార్యాలయాన్ని సందర్శించి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు.

'పల్లెకు పోదాం'పై విస్తృత ప్రచారం

పెదవాల్తేరు : బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పల్లెకు పోదాం కార్యక్రమంపై నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం చేపట్టాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథ్‌రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో కేంద్రం అమలు చేసిన 18 పథకాల గురించి వివరించాలన్నారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు మేడ పాటి రవీంద్ర, అరుణ కుమారి, సేనాపతి మహేష్, తదితరులు ఉన్నారు.

'జగన్‌కు కేసుల భయం'

సిరిపురం, ఫిబ్రవరి 9 : ముఖ్యమంత్రి జగన్ కేసుల భయం వల్లే బీజేపీతో పరోక్షంగా పొత్తు పెట్టుకున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జగన్ మురారి విమర్శించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రానికి బీజేపీ తీరని అన్యాయం చేస్తుంటే, రాజన్న బిడ్డగా బీజేపీపై తిరగబడాల్సింది పోయి ఆ నాయకుల కాళ్ల మీద పడడం దారుణమని పేర్కొన్నారు. కేంద్రం రెండు పాచిపోయిన లడ్డూలు ఇచ్చిందని గగ్గోలు పెట్టిన పవన్, ధర్మ పోరాట దీక్ష చేసిన చంద్రబాబు బీజేపీతోనే ఉన్నారని ఎద్దేవా చేశారు. ఈనెల 15 తరువాత నగరంలోని బీజేపీ కార్యాలయాన్ని వామపక్షాలతో కలిసి ముట్టడిస్తామని ఆయన చెప్పారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

ఆనందపురం, ఫిబ్రవరి 9 : తర్లువాడలో మజ్జి అప్పారావు జ్ఞాపకార్థం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నీ శుక్రవారంతో ముగిసింది. మిందివానిపాలెం జట్టు విన్నర్‌గా, తర్లువాడ జట్టు రన్నర్‌గా నిలిచాయి. వారికి ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక చేతుల మీదుగా బహుమతులు అందించారు.

పెద్దిపాలెంలో రక్తదాన శిబిరం

ఆనందపురం ఫిబ్రవరి 9 : యువత సమాజ సేవలో భాగస్వాములు కావాలని టీడీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దిపాలెంలో టీడీపీ నేత మరుపిళ్ల బంగారునాయుడు జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానంగా భావించాలన్నారు.